# ప్రజా తపన

prajathapana.com

News that matters




సత్యం, పవిత్రత,నిస్వార్థం, భూనభోంతరాల్లోని ఏ శక్తీ ఈ సుగుణములతోజాజ్వల్యమానంగా ప్రకాశించే వారి నీడనైనా తాకలేదు. విశ్వమంతా ఒక్కటై ఎదిరించినా వారు ప్రతిఘటించగలరు.

- స్వామి వివేకానంద


సంపుటి :01 సంచిక:85 మంగళవారం 16 మే 2023 మిరియాల. మంజునాథ ఆధ్వర్యంలో పేజీలు :08 ధర :05/-


## జూన్ 4, 5 తేదీల్లో అమెరికాతో భారత్ వ్యూహాత్మక వాణిజ్య చర్చలు

**ప్రజా తపన ,న్యూఢిల్లీ:**



భారత దేశం, అమెరికా బహుళ రంగాల్లో సత్సంబంధాలను విస్తరించుకుంటున్నాయి. ఎగుమతుల నియంత్రణలను గాడిలో పెట్టడం, హై-టెక్ కామర్స్‌ను మరింత విస్తరించడం, ఇరు దేశాలు టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్‌కు మార్గం సుగమం చేయడం వంటివాటిపై దృష్టి పెడుతున్నాయి. వీటన్నిటి కోసం ఇనీషియేటివ్ ఆన్ క్రిటికల్ అండ్ ఎమర్జింగ్ టెక్నాలజీ ఫలితాలను అమలు చేయడంలో భాగంగా మొదటి వ్యూహాత్మక వాణిజ్య చర్చలు జూన్ 4, 5 తేదీల్లో జరగబోతున్నాయి.ఇరు దేశాల జాతీయ భద్రతా సలహాదారుల మధ్య ఐసెట్ మొదటి సమావేశం జనవరి 31న జరిగింది. ద్వైపాక్షిక వాణిజ్య చర్చలను పునఃప్రారంభించేందుకు అమెరికన్ కామర్స్ సెక్రటరీ గినా రైమండో మార్చి 10న భారత దేశంలో పర్యటించారు. ఈ సందర్భంగా వ్యూహాత్మక వాణిజ్య చర్చలు జరపాలని ఇరు దేశాలు నిర్ణయించాయి.

భారత దేశ విదేశాంగ శాఖ కార్యదర్శి వినయ్ క్వాట్రా వచ్చే నెల ప్రారంభంలో అమెరికా వెళ్తారు. అమెరికన్ ఇండస్ట్రీ అండ్ సెక్యూరిటీ అండర్ సెక్రటరీ (కామర్స్) అలన్ ఎస్టేవెజ్‌తో సమావేశమవుతారు. వ్యూహాత్మక వాణిజ్య చర్చలు జరపడంతోపాటు, జూన్ 22న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వైట్ హౌస్‌కు వెళుతుండటంతో, తుది సన్నాహాలు చేస్తారు. భారత దేశంలో సాయుధ డ్రోన్ల తయారీ, మ్యునిషన్ టెక్నాలజీస్, విమానాల ఇంజిన్లు వంటి హైటెక్ సిస్టమ్స్ ఉత్పత్తి కోసం అమెరికా కంపెనీలకు అత్యంత ముఖ్యమైన నిబంధనలను సరళతరం చేసే విధంగా వినయ్ కృషి చేస్తారు. ఇంటర్నేషనల్ ట్రాఫిక్ ఇన్ ఆర్మ్స్ రెగ్యులేషన్స్, ఎక్స్‌పోర్ట్ అడ్మినిస్ట్రేషన్ రెగ్యులేషన్స్ కారణంగా అమెరికన్ కంపెనీలు, భారత దేశ కంపెనీలతో సంబంధాలు ఏర్పరచుకోవడానికి అడ్డంకులు, ఇబ్బందులు

02

## మండే సూరీడు



**ప్రజా తపన ,హైదరాబాద్ :**

తెలుగు రాష్ట్రాల్లో పగటి ఉష్ణోగ్రతలు ఠారెత్తిస్తున్నాయి. గత వారం వర్షాలతో జనం కాస్త ఉపశమనం పొందినా క్రమంగా ఉష్ణోగ్రతలు పెరుగుతుండటంతో జనం అల్లాడి పోతున్నారు. ఉక్కపోత, ఎండ వేడితో తెలుగు రాష్ట్రాల్లో ప్రజలు అల్లాడిపోతున్నారు. పగటి ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతుండటంతో జనం విలవిలలాడుతున్నారు. గత వారం బంగాళా ఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తన ప్రభావంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో విస్తారంగా వర్షాలు కురిశాయి. అకాల వర్షాలతో తీవ్రంగా పంట నష్టం జరిగింది. మరోవైపు బంగాళాఖాతంలో ఏర్పడిన మోచా తుఫాను ప్రభావం ఏపీ, తెలంగాణలపై పెద్దగా ఉండదని వాతావరణ శాఖ తేల్చేసింది. తుఫాను ప్రభావం బంగ్లాదేశం, మయన్మార్ వైపు వెళుతోందని

02



## ప్రభుత్వ గెస్ట్‌హౌజ్‌లో చంద్రబాబు నివాసం

**ప్రజా తపన ,విజయవాడ :**

లింగమనేని రమేష్‌కు చెందిన ఇంట్లో టీడీపీ అధినేత చంద్రబాబు ఎలా ఉంటున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు ప్రభుత్వ సలహాదారు, వైఎస్ఆర్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి. పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడాన్ని కోర్టుల ద్వారా అడ్డుకుంటూ ఆయన మాత్రం విలాసవంతమైన జీవితం గడుపుతున్నారని మండిపడ్డారు. తాము ఓట్ల కోసం తాయిలాలు పంచడం లేదని... సంక్షేమం కోసం నగదు ఇస్తున్నామన్నారు సజ్జల. కులం, వెనుకబాటుతనం, పార్టీలతో సంబంధం లేకుండా ఇస్తున్నామన్నారు. పేదరికం నుంచి సొంతకాళ్లపై నిలబడేలా సంక్షేమం అమలు చేస్తున్నామని తెలిపారు. సీఎం జగన్ దేశానికే తలమానికంగా ఆంధ్రప్రదేశ్ ముందుకు తీసుకెళున్నారని తెలిపారు. ప్రతిపక్షాలన్నీ మూకుమ్మడిగా తోడేళ్ళ మందలా ఎటాక్ చేయాలని చేస్తున్నాయని వ్యాఖ్యానించారు.

02

## ఆర్-5 జోన్ పిటిషన్‌పై సుప్రీంకోర్టులో ముగిసిన విచారణ

**ప్రజా తపన ,న్యూఢిల్లీ:**

ఆర్-5 జోన్‌కు వ్యతిరేకంగా అమరావతి రైతులు దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టులో విచారణ ముగిసింది. అమరావతి కేసుతో పాటు ఆర్ 5 జోన్ కేసును కలిపి వినాలని సుప్రీం ధర్మాసనం నిర్ణయించింది. సోమవారం ఉదయం ఆర్ - 5 జోన్‌పై సుప్రీంలో విచారణకు రాగా రైతుల తరపున వాదన సీనియర్ న్యాయవాదులు హరీశ్ సాల్వే, ముకుల్ రొతగి, శ్యాందివాన్, దేవ్ దత్ కామత్ వాదనలు వినిపించారు. అయితే అమరావతి కేసుతో పాటు ఆర్-5 జోన్ కేసును కలిపి విచారణ జరపాలని నిర్ణయిస్తూ.. అమరావతి కేసును విచారిస్తున్న జస్టిస్ జోసెఫ్ ధర్మాసనం ముందు ఆర్-5 జోన్ పిటిషన్‌ను బదిలీ చేయాలని సుప్రీం ధర్మాసనం ఆదేశించింది. శుక్రవారంలోగానే రెండు పిటీషన్లపై

02



## ఖర్గేకు సమన్లు

**ప్రజా తపన ,బెంగళూరు:**

భజరంగ్ దళ్ వంటి సంస్థలను బ్యాన్ చేస్తామని కర్ణాటక ఎన్నికల సందర్భంగా ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. మతం పేరిట ప్రజల మధ్య విద్వేషాలు రాజేస్తున్న అలాంటి సంస్థలపై కఠిన

02

## ఉగ్రమూకల కేసు.. పోలీసుల అదుపులో మరో అనుమానితుడు

**ప్రజా తపన ,హైదరాబాద్:**



నగరంలో కలకలం సృష్టించిన ఉగ్రమూకల కేసులో కౌంటర్ ఇంటెలిజెన్స్ అధికారుల దర్యాప్తు కొనసాగుతోంది. తాజాగా చంద్రాయణగుట్టలోని బాబానగర్‌లో ఏటీఎస్ (యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్), కౌంటర్ ఇంటెలిజెన్స్ పోలీసులు మరొకర్ని అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో ఇటీవల హైదరాబాద్‌లో ఆరుగురుని అరెస్టు చేసిన పోలీసులు.. ఇవాళ మరొకరిని అదుపులోకి తీసుకున్నారు. ఇప్పటి వరకు ఉగ్రవాద కార్యకలాపాల కేసులో హైదరాబాద్,

02

## ఏపీలో అమల్లోకి ఈ చిట్స్ విధానం

**ప్రజా తపన ,విజయవాడ:**

ఏపీలో చిట్ ఫండ్ సంస్థల వల్ల ప్రజలు ఇబ్బంది పడతారేమోనని పలు సంస్థలపై దాడులు చేసి కేసులు పెట్టిన ఏపీ ప్రభుత్వం కొత్త రూల్స్ తీసుకు వచ్చింది. చిట్స్ నిర్వహణలో కొత్త విధానాన్ని తీసుకొచ్చింది ఇక నుంచి అంతా ఆన్ లైన్ విధానంలో లావాదేవీలు జరపాల్సి ఉంటుంది. ఇందు కోసం ఈ -చిట్స్ అనే ఎలక్ట్రానిక్ అప్లికేషన్‌ను ప్రారంభించారు. మంత్రి ధర్మన ప్రసాదరావు ఈ చిట్స్ విధానాన్ని



02

# జూన్ 4, 5 తేదీల్లో అమెరికాతో భారత్ వ్యూహాత్మక వాణిజ్య చర్చలు

(మొదటిపేజీ తరువాయి)

ఎదురవుతున్నాయి. వీటిని తొలగించి, ఇరు దేశాల కంపెనీలు సంబంధాలు ఏర్పాటు చేసుకోవడానికి తగిన ఏర్పాట్లు చేస్తారు. మోదీ, అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ జూన్ 22న సమావేశమవుతారు. ఈ నెల 19 నుంచి 21 వరకు జపాన్‌లో జరిగే జీ-7 సదస్సు నేపథ్యంలో మోదీ, బైడెన్ సమావేశమయ్యే అవకాశాలు ఉన్నాయి. అదే విధంగా ఈ నెల 24న జరిగే క్వాడ్ సదస్సు సందర్భంగా కూడా వీరిరువురూ కలిసే అవకాశం ఉంది. ఫార్ పసిఫిక్ నేషన్స్ క్రిటికల్ ఎంగేజ్‌మెంట్‌లో భాగంగా మే 22న పపువా న్యూగినియాలోని పోర్ట్ మోర్స్‌బైలో కూడా వీరిరువురూ కలవవచ్చు. సోలోమన్ దీవుల్లో చైనా ప్రాబల్యం పెరుగుతున్న నేపథ్యంలో ఫార్ పసిఫిక్‌తో భారత దేశం విస్తృత స్థాయి సంబంధాలను ఏర్పరచుకుంటోంది. ఈ దీవికి 100 మిలియన్ డాలర్ల రుణాన్ని మోదీ ప్రకటించబోతున్నారు. ఇరు దేశాల దౌత్యవేత్తలు తెలిపిన సమాచారం ప్రకారం, తేజస్ మార్క్-2 కోసం భారత దేశంలో ఎఫ్-414 జెట్ ఇంజిన్లను సంయుక్తంగా తయారు చేయడం కోసం అమెరికన్ కంపెనీ జనరల్ ఎలక్ట్రిక్ చేసిన దరఖాస్తుకు అమెరికా ఆమోదం తెలిపే అవకాశం కనిపిస్తోంది. ఈ ఆమోదం మోదీ అమెరికా పర్యటనకు ముందే లభించే అవకాశాలు ఉన్నాయి. జనరల్ ఎలక్ట్రిక్ కంపెనీకి యూరోపియన్ యూనియన్‌లో ఉన్న అనుబంధ కంపెనీలు కూడా భారత దేశానికి వచ్చే విధంగా చర్యలు తీసుకునే అవకాశం ఉంది. ఈ కంపెనీలు ఎఫ్-414 ఇంజిన్లను భారత దేశంలోనే తయారు చేస్తాయి. వాస్తవాధీన రేఖ వెంబడి చైనా డ్రోన్లు సృష్టిస్తున్న ఇబ్బందులను తిప్పి కొట్టడానికి ఉపయోగపడే సాయుధ డ్రోన్లను భారత దేశానికి సరఫరా చేయడానికి అమెరికా సిద్ధంగా ఉంది.

# ప్రభుత్వ గెస్ట్‌హౌజ్‌లో చంద్రబాబు నివాసం

(మొదటిపేజీ తరువాయి)

ఏమరుపాటుగా ఉంటే వారు చెప్పేదే వాస్తవం అనిపిస్తుందని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో పరిస్థితి మొత్తం వేరేగా ఉందన్నారు. 80 శాతం కుటుంబాలు జగన్‌తో ఉన్నామని చెబుతున్నా తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఫైర్ అయ్యారు. చంద్రబాబు బరితెగింపుతనానికి ఉదాహరణ ఆయన ఉంటున్న నివాసమని సజ్జల రామకృష్ణా రెడ్డి అన్నారు. అధికారం పోయిన కూడా ఇంకా చంద్రబాబు అదే ఇంటిలో ఎలా ఉంటున్నారని ప్రశ్నించారు. జాతి సంద కింద లింగమనేని రమేష్ చంద్రబాబు ఉంటున్న ఇంటిని ప్రభుత్వానికి రాసిచ్చారని అన్నారు. అక్రమాలు చేయటం, వాటిని కప్పిపుచ్చుకోవటం చంద్రబాబు నిత్యం అలవాటేనని సజ్జల ఎద్దేవా చేశారు. పేదలకు భూమి ఇవ్వకుండా కోట్ల రూపాయల విలువైన భూమి దోచేయలని చూశారని ఆరోపించారు. రియల్ ఎస్టేట్ ఏజెంట్‌లతో కలిసి పేదలకు స్థలాలు ఇవ్వకుండా అడ్డుకుంటున్నారని అన్నారు. సుప్రీం కోర్టుకు తీసుకెళ్లి పేదలకు ఇళ్ళు ఇవ్వకుండా అడ్డుకుంటున్నారని, కరుడు గట్టిన దుర్మార్గులు, పెత్తందార్ల పక్షాన టీడీపీ, జనసేన,కమ్యూనిస్టులు ఒక్కటయ్యారని ధ్వజమెత్తారు. కుట్రపూరితంగా జగన్ పై దాడి మొదలు పెట్టారని, నిజాయితీకి, అబద్ధానికి మధ్య వార్ జరుగుతుందన్నారు సజ్జల. ఇటు సైపు వైసీపీ ఉంటే అటు వైపు అందరూ ఒక్కటయ్యారన్నారు. జగన్ చేస్తున్న రాజకీయం చంద్రబాబుకు ఉరితాడు లాంటిదని హెచ్చరించారు. ఎన్నికలు దగ్గరకు వస్తున్నాయి కాబట్టి క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండి పనిచేయాలని క్యాడర్‌కు సూచించారు .చంద్రబాబుకు తనకు నచ్చని విషయాలపై న్యాయస్థానాన్ని ఆశ్రయించి తప్పుడు సమాచారం ఇవ్వటంలో సిద్ధహస్తుడగా మారారని సజ్జల మండిపడ్డారు. పేదలకు ఇళ్ళను ఇచ్చేందుకు వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పని చేస్తుంటే, చంద్రబాబు కోర్టులో కేసులు వేసి మోసగిస్తున్నారని అన్నారు. విలాసవంతమైన జీవితం గడుపుతున్నారని పేదలు తమ సొంత ఇంటి కలను నెరవేర్చేందుకు చేస్తున్న ప్రయత్నాలను కేసుల రూపంలో అడ్డుకుంటున్నారని అన్నారు. ఇలాంటి విషయాలను ప్రజలు గమనిస్తున్నారని, రాబోయే రోజులు చంద్రబాబుకు ఆంధ్రప్రదేశ్‌లో స్థానం లేకుండా పోవటం ఖాయమని జోస్యం చెప్పారు. చంద్రబాబు చేస్తున్న రాజకీయాలను ప్రజల్లోనే తేల్చుకుంటామన్నారు. ప్రతిపక్షాలన్నీ కలసి కట్టుగా దాడి చేసేందుకు ప్రయత్నించిన వేళ మరింత బాధ్యతగా వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ పని తీరు ఉంటుందన్నారు. ఇందుకు అవసరమైన అన్ని చర్యలను జగన్ స్వయంగా పర్యవేక్షిస్తున్నారని సజ్జల తెలిపారు.

# ఆర్-5 జోన్ పిటిషన్‌పై సుప్రీంకోర్టులో ముగిసిన విచారణ

(మొదటిపేజీ తరువాయి)

విచారణకు జస్టిస్ జోసెఫ్ ధర్మాసనం ముందు లిస్ట్ చేయాలని రిజిస్ట్రీకి సుప్రీం ఆదేశాలు జారీ చేసింది.

సోమవరం జరిగిన విచారణలో ఆర్- 5 జోన్‌పై తదుపరి విచారణ వరకూ స్టే ఇవ్వాలని రైతుల తరపు న్యాయవాది హరీశ్ సాల్వే సుప్రీంను కోరగా... ఏపీ ప్రభుత్వ తరపు న్యాయవాదులు అడ్డుపడ్డారు. అమరావతి పిటిషన్ పెండింగ్‌లో ఉన్నందునే హైకోర్టు ఆర్- 5 జోన్ పైన మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చిన విషయాన్ని ఏపీ ప్రభుత్వ తరపు న్యాయవాది నిరంజన్‌రెడ్డి ఉన్నతన్యాస్థానం దృష్టికి తీసుకొచ్చారు. ఆర్ -5 జోన్‌లో వేరే ప్రాంతాల వారికి ఇళ్ల స్థలాల కేటాయింపుపై హైకోర్టు ఉత్తర్వులపై స్టే విధించాలని, రాష్ట్ర ప్రభుత్వ జీవోలను రద్దు చేయాలని సుప్రీంను రైతులు కోరారు. అమరావతి మాస్టర్ ప్లాన్‌కు విరుద్ధంగా రాష్ట్ర ప్రభుత్వం జీవోలు తీసుకొచ్చిందని రైతులు సుప్రీం కోర్టుకు తెలిపారు.కాగా.. ఆర్-5 జోన్‌పై రైతులు దాఖలు చేసిన మధ్యంతర అప్లికేషన్లను ఏపీ హైకోర్టు తిరస్కరించింది. కోర్టు తుది ఉత్తర్వులకు లోబడి వ్యవహరించాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చేందుకు విముఖత చూపుతూ ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం ఆదేశాలు ఇచ్చింది. దీంతో హైకోర్టు ఉత్తర్వులపై సుప్రీంకోర్టులో రైతులు ఎస్ఎల్పీ దాఖలు చేశారు. గతంలో హైకోర్టు ఉత్తర్వులు ఇవ్వలేదని.. తగిన ఉత్తర్వులు ఇవ్వాలని సర్వోన్నత న్యాయస్థానంలో దాఖలు చేసిన పిటిషన్‌ను రైతులు వెనక్కి తీసుకున్న విషయం తెలిసిందే. హైకోర్టు ఇచ్చే ఉత్తర్వుల ఆధారంగా మరోసారి సుప్రీంకోర్టును ఆశ్రయించేందుకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివైస్ నేతృత్వంలోని ధర్మాసనం రైతులకు అవకాశం కల్పించింది. సుప్రీం ధర్మాసనం కల్పించిన అవకాశం మేరకు రాష్ట్ర హైకోర్టు ఉత్తర్వులను సవాలు చేస్తూ అమరావతి రైతులు సుప్రీంలో మరోసారి పిటిషన్ దాఖలు చేశారు. న్యాయమూర్తులు జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ రాజేశ్ బిందాల్‌లతో కూడిన ధర్మాసనం ముందు విచారణ జరిగింది. వాదనల తర్వాత అమరావతి కేసుతో పాటు ఆర్-5 జోన్ కేసును కలిపి వినాలని సుప్రీం ధర్మాసనం నిర్ణయించింది.

# వంద రోజులకు చేరుకున్నలోకేష్ యువగళం పాదయాత్ర

**పాదయాత్రలో పాల్గొన్న భువనేశ్వరి, నారా బ్రాహ్మణి**

**నంద్యాల:**



నేడు శ్రీశైలం నియోజకవర్గంలో నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర ప్రారంభమైంది. నేటితో యువగళం పాదయాత్ర వంద రోజులు పూర్తి చేసుకోనుంది. జనవరి 27న చిత్తూరు జిల్లా కుప్పంలో పాదయాత్ర ప్రారంభమైంది. పాదయాత్రలో తల్లి భువనేశ్వరి సహా నారా, నందమూరి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. బోయరేవుల నుంచి పాదయాత్ర ప్రారంభమైంది. ముత్తుకూరు, పెద్ద దేవళాపురం, సంతజూటూరు, పరవ ంటూరు మీదుగా బండి ఆత్మకూరు వరకు పాదయాత్ర సాగనుంది. సంత జూటూరులో చెంచులతో లోకేష్ ముఖాముఖి నిర్వహించనున్నారు. యువగళం పాదయాత్ర వంద రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా భారీగా కార్యకర్తలు, అభిమానులతో ఉత్సాహంగా ముందుకు సాగుతున్నారు. జైలోకేష్, జై తెలుగుదేశం నినాదాలతో యువగళం పాదయాత్ర మార్గం హోరెత్తుతోంది. పెద్దఎత్తున అభిమానులు, కార్యకర్తలు తరలివచ్చారు. దాంతో 3 కి.మీ. మేర ట్రాఫిక్ స్థంభించింది. బాణాసంచా మోతలు, డప్పుల చప్పుళ్లు, నినాదాల హోరుతో జాతరను యువగళం తలపిస్తుస్తోంది. ఈ సందర్భంగా వంద రోజుల విశేషాలతో టీడీపీ నేత కేశినేని శివనాథ్ (చిన్ని) రూపొందించిన ప్రత్యేక సంచికను లోకేష్ ఆవిష్కరించారు. యువ గళం పాదయాత్ర అరాచక సర్కారుపై జనజైత్ర యాత్రగా చరిత్రలో నిలిచిపోతుందని టీడీపీ నేతలు పేర్కొన్నారు. లోకేష్ చేపట్టిన యువగళం వందరోజులు పూర్తయిన సందర్భంగా పాదయాత్ర విశేషాలతో కేశినేని శివనాథ్(చిన్ని) ప్రత్యేక సంచిక తీసుకొచ్చారు. శ్రీశైలం నియోజకవర్గం బోయరేవుల క్యాంప్ సైట్ వద్ద సోమవారం ఉదయం యువనేత నారా లోకేష్ ప్రత్యేక సంచిక "జనహృదయ మైనారా లోకేష్"ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ టీడీపీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్, మాజీ మంత్రి రావుల చంద్రశేఖర్ రెడ్డి, మాజీ మంత్రి పీతల సుజాత, మాజీ మంత్రి అమర్నాథ్ రెడ్డి, మాజీ మంత్రి ఏరాసు ప్రతాప్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బీదా రవిచంద్ర యాదవ్, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి , శ్రీశైలం నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జ్ బుడ్డా రాజశేఖర్ రెడ్డి, టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఎంఎస్ రాజు, దూండి రాకేష్, యువగళం మీడియా కోఆర్డినేటర్ బీవీ.వెంకట రాముడు, భాష్యం ప్రవీణ్, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

# మండే సూరీడు

(మొదటిపేజీ తరువాయి)

ప్రకటించింది. తెలంగాణలో ఉష్ణోగ్రతలు నాలుగైదు రోజులుగా క్రమంగా పెరుగుతున్నాయి. గురువారం పలు జిల్లాల్లో అక్కడక్కడా తేలికపాటి జల్లులు కురిసినా, చాలా చోట్ల ఎండ అదరగొట్టేసింది. మరో నాలుగు రోజుల పాటు ఎండల తీవ్రత ఇలాగే ఉండే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. సగానికిపైగా జిల్లాలకు ఆరెంజ్? అలర్ట్?ను జారీ చేసింది. ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి, కరీంనగర్, సిద్దిపేట, జయశంకర్?భూపాలపల్లి, జనగామ, వరంగల్, మహబూబాబాద్, ములుగు, ఖమ్మం, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి, నల్గొండ, నాగర్?కర్నూల్, మహబూబ్?నగర్, నారాయణపేట, వనపర్తి, గద్వాల జిల్లాలకు ఆరెంజ్? అలర్ట్?ను జారీ చేసింది. ఈ జిల్లాల్లో టెంపరేచర్లు మరింత పెరిగే అవకాశం ఉందని హెచ్చరించింది. వికారాబాద్, రంగారెడ్డి, ఖమ్మం, ములుగు, నాగర్?కర్నూల్, గద్వాల, కొత్తగూడెం, సూర్యాపేట జిల్లాల్లో అక్కడక్కడా తేలికపాటి జల్లులు కురిశాయి. రాజేంద్రనగర్, కొత్తగూడెం జిల్లా దమ్మపేటలో అత్యధికంగా 1.9 సెంటీ మీటర్ల వర్షం పడింది. కరీంనగర్? జిల్లా వీణవంక, జగిత్యాల జిల్లా జైనలో అత్యధికంగా 44.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. జయశంకర్?భూపాలపల్లి జిల్లా తాడిచర్లలో 44.1, పెద్దపల్లి జిల్లా ముత్తారంలో 43.8, ఆదిలాబాద్? జిల్లా చాప్రాలలో 43.3, నిర్మల్? జిల్లా బుట్టాపూర్?లో 42.8, కవ్వాల్? టైగర్? రిజర్వ్?లో 42.8 డిగ్రీల చొప్పున టెంపరేచర్లు నమోదయ్యాయి. రాబోయే మూడు రోజుల్లో ఉపరితల ఆవర్తనం ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం సంచాలకులు తెలిపారు. ఉష్ణోగ్రతలు 2 నుంచి 4 డిగ్రీల వరకు పెరుగుతాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గురువారం అత్యధికంగా అనంతపురం జిల్లా శెట్టూరులో 41 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా శుక్రవారం 60 మండలాల్లో వడగాలులు వీచే అవకాశముందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఓ ప్రకటనలో తెలిపింది. మరోవైపు బంగాళాఖాతంలో ఏర్పడిన 'మోచా తుపాను ఆగ్నేయ బంగ్లాదేశ్, ఉత్తర మయన్మార్ మధ్యలో కాక్స్ బజార్ వద్ద మే 14న తీరం దాటే అవకాశముందని వాతావరణ శాఖ తెలిపింది. ప్రస్తుతం తుపాను పోర్టుబ్లెయిర్‌కు నైరుతి దిశలో 510 కి.మీ. దూరంలో, కాక్స్‌బజార్ కు దక్షిణ నైరుతి దిశలో 1,190 కి.మీ. దూరంలో, మయన్మార్‌లోని సిత్వే కు దక్షిణ నైరుతి దిశలో 1,100 కి.మీ. దూరంలో కేంద్రీకృతమై ఉందన్నారు. మోచా ఉత్తర ఈశాన్య దిశగా కదులుతూ గురువారం రాత్రికి తీవ్ర తుపానుగా మారుతుంది. ఉదయానికి మధ్య బంగాళాఖాతంలో అత్యంత తీవ్ర తుపానుగా బలపడుతుందన్నారు. తీరం దాటే సమయంలో గరిష్ఠంగా 175 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశముందన్నారు. తుఫాను ముప్పు తప్పడంతో ఏపీలో వేసవి ఉష్ణోగ్రతలు కూడా గరిష్టంగా నమోదు కానున్నాయి. అనకాపల్లి జిల్లా గొలుగొండ, నర్సీపట్నం, నాతవరం, కాకినాడ జిల్లా కోటనందూరు మండలంలో తీవ్ర వడగాల్పులు వీచే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ ప్రకటించింది. రాష్ట్రంలో 60 మండలాల్లో వడగాల్పులు, శనివారం 32 మండలాల్లో తీవ్ర వడగాల్పులు, 194 మండలాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందని తెలిపారు. మిగిలిన చోట్ల ఎండ ప్రభావం చూపే అవకాశం ఉంది. ప్రజలు ఎండ తీవ్రత పట్ల అప్రమత్తంగా ఉండాలని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

# ఖర్గేకు సమన్లు

(మొదటిపేజీ తరువాయి)

చర్యలు తీసుకుంటామని తెలిపింది. దీనికి సంబంధించి పంజాబ్ కోర్టు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు సమన్లు జారీ చేసింది. భజరంగ్ దళ్‌ను బ్యాన్ చేస్తామంటూ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీపై వివరణ ఇవ్వాలని కోరింది. కర్ణాటక ఎన్నికల్లో భజరంగ్ దళ్‌పై కాంగ్రెస్ ఆరోపణలు ఆ సంస్థ ప్రతిష్టను దెబ్బతీసేలా ఉన్నాయంటూ హిందూ సురక్షా పరిషత్ వ్యవస్థాపకుడు హితేష్ భరద్వాజ్ అభ్యంతరం వ్యక్తంచేశారు. ఇటీవల ముగిసిన కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా, కాంగ్రెస్ తన మేనిఫెస్టోలో బజరంగ్ దళ్‌ను సిమి మరియు అల్-ఖైదా వంటి దేశ వ్యతిరేక సంస్థలతో పోల్చడం అభ్యంతరకరమని పిటిషనర్ పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీపై సంగ్రూర్ కోర్టులో రూ.100 కోట్ల పరువు నష్టం దావా వేశారు. దీనిపై విచారణ జరిపిన కోర్టు.. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకి సమ్మన్లు జారీ చేసింది. భజరంగ్ దళ్‌ను బ్యాన్ చేస్తామని మేనిఫెస్టోలో కాంగ్రెస్ హామీ ఇవ్వడం.. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలోనూ ప్రధాన చర్చనీయాంశంగా మారింది. ఈ అంశంపై కాంగ్రెస్, బీజేపీ నేతలు పరస్పర విమర్శనాస్త్రాలు సంధించుకున్నారు.

# ఉగ్రమూకల కేసు.. పోలీసుల అదుపులో మరో అనుమానితుడు


(మొదటిపేజీ తరువాయి)

భోపాల్‌లో కలిపి 16 మందిని పోలీసులు అరెస్టు చేశారు. కరుడుగట్టిన ఉగ్రవాద సంస్థ హిజ్బ్ ఉత్ తహరీం (హెచ్‌యూటీ)తో సంబంధాలు ఉన్నాయన్న ఆరోపణలతో వీరిని అరెస్టు చేసి స్థానిక న్యాయస్థానంలో హాజరుపరిచి భోపాల్‌కు తరలించారు. ఈ కేసులో హైదరాబాద్‌లో అరెస్టయిన వారిలో ఐదుగురిని మధ్యప్రదేశ్‌లోని భోపాల్ ఏటీఎస్ పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు. కస్టడీ విచారణలో భాగంగా వారిని మరోసారి ఇవాళ హైదరాబాద్‌కు తీసుకొచ్చారు. వారు ఇచ్చిన సమాచారం ఆధారంగా చంద్రాయన గుట్టలో ఓ అనుమానితుడిని అదుపులోకి తీసుకున్నారు. రహస్య ప్రదేశంలో విచారిస్తున్నట్లు సమాచారం. అరెస్టయిన నిందితులు ఉగ్ర కుట్ర వ్యవహారంపై సమాచారాన్ని ఆ వ్యక్తికి అందించినట్లు పోలీసులు గుర్తించారు. టాస్క్ ఫోర్స్, కౌంటర్ ఇంటెలిజెన్స్ పోలీసుల సాయంతో ఏటీఎస్ పోలీసులు విచారణ చేపడుతున్నారు.

# ఏపీలో అమల్లోకి ఈ చిట్స్ విధానం

(మొదటిపేజీ తరువాయి)

ప్రారంభించారు. . ఆంధ్రప్రదేశ్ రెవిన్యూ రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖల ఆధ్వర్యంలో ఇది పని చేస్తుంది. ఏపీలో చిట్ ఫండ్ వ్యాపారం పారదర్శకంగా జరిగేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని మంత్రి ధర్మాన ప్రసాదరావు తెలిపారు. ఏపీ స్టాంపులు రిజిస్ట్రేషన్ శాఖ ఆధ్వర్యంలో ఈ- చిట్స్ అనే ఎలక్ట్రానిక్ విధానం ప్రారంభిస్తున్నామని.. చందా దారులు అంతా ఈ- చిట్స్ ద్వారా తన డబ్బు సురక్షితంగా ఉందో లేదో ఈ కొత్త విధానం ద్వారా తెలుసుకోవచ్చు అన్నారు.. చిట్స్ వేసే చందాదారు మోస పోకుండా చూడాలనే ఈ విధానం అని పనిచేస్తుందన్నారు మంత్రి ధర్మాన.. కొత్త విధానం ప్రకారం అన్ని చిట్ ఫండ్ కంపెనీలు ఆన్ లైన్ ద్వారా మాత్రమే లావాదేవీలు నిర్వహించాలని పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు ఆన్‌లైన్‌లో పరిశీలించి ఆమోదం తెలియజేస్తారన్న తెలిపారు.. ఈ విధానం ద్వారా మాత్రమే ఇక నుంచి చిట్‌లు నిర్వహించాలి.. గతంలో నమోదు అయిన సంస్థలు క్రమంగా ఈ విధానంలోకి రావాల్సిం దేనని స్పష్టం చేశారు. అంతకు ముందు ఎమ్మెల్సీల ప్రమాణస్వీకార కార్యక్రమంలో పాల్గొన్న ధర్మాన రాష్ట్రంలో కుట్ర జరుగుతోందని ఆరోపించారు. సీఎం వైఎస్ జగన్ సర్కార్‌పై కుట్ర చేస్తున్నార న్నారు. స్వాతంత్ర్యం వచ్చిన 80 ఏళ్ళు అయినా ఇంకా కొన్ని సామాజిక వర్గాలు వెనుకబడే ఉన్నాయన్నారు.. గత ప్రభుత్వాలు ఈ పరిస్థితిని సరిదిద్దలేక పోయాయన్న ఆయన.. వైఎస్ జగన్ ప్రభుత్వమే ధైర్యంగా అన్ని వర్గాల్లో ఆత్మవిశ్వాసం నింపిందన్నారు.. చట్ట సభల్లో ప్రాతినిధ్యం కల్పించారు.. కానీ, రాష్ట్రంలో ఇప్పుడు కుట్ర జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. బటన్ నొక్కి పథకాలు అందిస్తున్నారు అంటూ సీఎం వైఎస్ జగన్



వ్యంగంగా మాట్లాడుతున్నారు అని ఫైర్ అయ్యారు మంత్రి ధర్మాన. ఇన్నేళ్ళు అయినా 21 శాతం మంది అక్షరం ముక్క రాని వాళ్లు ఉన్నారు.. ఎందుకు ఇలాంటి పరిస్థితి ఉందని ఆయన ప్రశ్నించారు. ఇది పాలనలోని లోపం కాదా? అని ప్రశ్నించారు. సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఈ లోపాన్ని సరిదిద్దే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. ఇదే ప్రయత్నం 50 ఏళ్ల కిందటే చేసి ఉంటే.. ఇవాళ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మరో రకంగా ఉండేదని వ్యాఖ్యానించారు మంత్రి ధర్మాన ప్రసాదరావు.

# ఫ్యాన్ కు కూటమి టెన్షన్

**విజయవాడ :**

వచ్చే ఎన్నికలే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయం వేడెక్కుతోంది. పొత్తులపై ఒకరు మాట్లాడుతుంటే.. పార్టీల కలయికపై అధికారపక్షం విరుచుకుపడుతోంది. ఇప్పటికే చంద్రబాబు రైతులను పరామర్శించడం పేరుతో జిల్లాల్లో పర్యటిస్తున్నారు. ఇదే సమయంలో పొత్తులపై పవన్ కల్యాణ్ మాట్లాడటం వాడీవేడీ చర్చను రాజేస్తోంది. బీజేపీకి మిత్రపక్షంగా ఉన్నారు జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్. అయినప్పటికీ ఆయన చూపు ఎక్కడుందో? ఆయన ఎవరితో పొత్తు కోరుకుంటున్నారో..? పవన్ కల్యాణ్ మాటలు చెప్పకనే చెబుతున్నాయి. పొత్తులపై ముందు నుంచీ పవన్ కల్యాణ్‌ది ఒకటే మాట. వైసీపీ వ్యతిరేక ఓటు చీలనివ్వనని పదే పదే రిపీట్ చేస్తున్నారు. ఇక విపక్షాల కదలికలను నిశితంగా గమనిస్తున్న అధికారపక్షం.. ధీటుగానే జనాల్లోకి వెళ్తోంది. ఈ అంశంపై కావలి సభలో తీవ్రంగానే స్పందించారు సీఎం జగన్. చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లను అస్సలు ఉపేక్షించడం లేదు సీఎం జగన్. గతంలో చంద్రబాబు ఏం చేశారు? వాటివల్ల రైతులకు, ప్రజలకు కలిగిన కష్టాలను ప్రముఖంగా ప్రస్తావిస్తున్నారు. మళ్లీ చంద్రబాబుకు ఓటేస్తే ఏం జరుగుతుందో జనం ఆలోచించాలంటున్నారు సీఎం జగన్. చంద్రబాబుకు పవన్‌కల్యాణ్ పాలేరుగా ఉన్నారని విమర్శించారు మంత్రి జోగి రమేష్. చంద్రబాబు కాళ్ల దగ్గర పార్టీని తాకట్టు పెట్టారని విమర్శించారు. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో ఎంతమంది కలిసొచ్చినా.. వైసీపీయే గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. జీవో 1పై హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టులో సవాల్ చేస్తామన్నారు మంత్రి జోగి రమేష్.

# రంగులు మారుతున్న రాజకీయం

**నెల్లూరు:**

నెల్లూరు జిల్లాలో రాజకీయం రోజుకో మలుపు తీసుకుంటోంది. మాజీ జడ్పీ చైర్మన్ తెలుగుదేశం నుంచి వైసీపీలో చేరగా వైసీపీ రెబల్ ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి తన రాజకీయ ప్రత్యర్థులతో వరుస భేటీలు నిర్వహిస్తున్నారు. మూడు రోజు క్రితం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నేత కంభం విజయరామిరెడ్డితో సమావేశమయ్యారు. తాజాగా ఉదయగిరి నియోజకవర్గ టీడీపీ ఇన్ ఛార్జి బొల్లినేని వెంకటరామారావును కలిశారు. కలిగిరిలోని బొల్లినేని క్యాంప్ కార్యాలయానికి వెళ్లిన మేకపాటికి వెంకటరామారావు ఎదురేగి స్వాగతం పలికారు. అనంతరం ఇద్దరూ ఏకాంతంగా మాట్లాడుకున్నారు. భవిష్యత్తు రాజకీయాలపై చర్చించాలని వారి అనుచరులు చెబుతున్నారు. ఉదయగిరి అభివృద్ధి కోసమే బొల్లినేనిని కలిశానని మేకపాటి వ్యాఖ్యానించారు. మూడు రోజుల క్రితమే విజయరామిరెడ్డిని కలిశానని, బొల్లినేని, కంభం, చెంచల బాబుయాదవ్ తో తాను భవిష్యత్తులో కలిసి పనిచేస్తానన్నారు. నియోజకవర్గ ప్రజలే మొదటిప్రాధాన్యమని, వారికి అన్నివిధాలా అండగా ఉంటానన్నారు. ప్రజలతో మమేకమయ్యేందుకు బహిరంగ సమావేశం ఏర్పాటు చేస్తానని, అందులో నేరుగా ప్రజలతోనే మాట్లాడతానన్నారు. మేకపాటికి ముఖ్యమంత్రి జగన్ ద్రోహం చేశారని బొల్లినేని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తలను పరిచయం చేస్తూ వీళ్లల్లో కొందరు మీ బాధితులే అని చెప్పారు. ఏవైనా ఇబ్బందులు పెట్టివుంటే తనను క్షమించాలని మేకపాటి కోరారు. ఉదయగిరి నుంచి ప్రత్యర్థులుగా వరుసగా మూడుసార్లు పోటీచేశారు. తాజాగా వీరిద్దరి భేటీ నెల్లూరు రాజకీయాల్లో చర్చనీయాంశమైంది. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసీపీ నిర్ణయాన్ని ధిక్కరిస్తూ క్రాస్ ఓటింగ్ కు పాల్పడ్డారనే ఆరోపణలతో మేకపాటి చంద్రశేఖర్ రెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. ఆయనతోపాటు ఇదే జిల్లాకు చెందిన మరో ఇద్దరు ఎమ్మెల్యేలు ఆనం రామనారాయణరెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డిపై కూడా వేటు వేశారు

# రెండు ఘోర రోడ్డు ప్రమాదాలు





**అమరావతి**

రాష్ట్రంలో జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో పన్నెండుమంది మృతి చెందారు. కడప జిల్లా కొండాపురం మండలం పి.అనంతపురం దగ్గర జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో లారీ, తుఫాన్ వాహనం ఢీకొన్నాయి. ఆరుగురు మృతి చెందగా , మరో ఐదు మందికి తీవ్ర గాయాలు అయ్యాయి. క్షతగాత్రులను తాడిపత్రి ఆసుపత్రికి తరలించారు. తాడిపత్రి, బళ్ళారికి చెంచిన వారు తిరుమల శ్రీవారి దర్శనం అనంతరం తిరుగు ప్రయాణంలో ప్రమాదం జరిగింది.

కాకినాడ జిల్లా తాళ్ళరేవు తాళ్ళరేవు బైపాస్ వద్ద మరో ఘోర రోడ్డుప్రమాదం జరిగింది. ఆటోను బస్సు ఢీకొన్న ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న ఆరుగురు మహిళలు ఘటనాస్థలంలోనే మృతి చెందారు. వీరంతా రొయ్యల ప్రాసెసింగ్ కంపెనీలో పనిచేసే మహిళలు.

## పొత్తులతో జనసేన పోటీ చేస్తే వైసిపి నేతలకు ఉలుకెందుకు ?

**విశాఖపట్నం**

పొత్తులతో జనసేన పార్టీ ఎన్నికల్లో పోటీ చేస్తే వైసిపి నేతలకు ఉలికెందుకని ఆ పార్టీ దక్షిణ నియోజక వర్గం నాయకులు పీవీ శివప్రసాద్ రెడ్డి అన్నారు. నగరం లోని డాబా గార్డెన్స్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఈ రాష్ట్రంలో భవిష్యత్తు ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, పొత్తులు పై మాట్లాడిన వెంటనే మంత్రి అమర్నాథ్, పవన్ కళ్యాణ్ పై చేసిన వ్యాఖ్యలు తీవ్రంగా ఖండిస్తున్నాం అన్నారు. ప్రజా సమస్యల పై కానీ తన మంత్రిత్వ శాఖ పై ఏనాడూ స్పందిస్తూ పత్రికా సమావేశాలు ఏర్పాటు చేసి మాట్లాడని మంత్రి అమర్నాథ్ జగన్ మోహన్ రెడ్డి దగ్గర ప్రాపకం కోసం జనసేన పై విమర్శలు చేసేందుకు సిద్ధంగా ఉంటారన్నారు. జనసేన పార్టీ జనసైనికులను, విరామహిళలను ఉద్దేశించి కూలీలు అని మాట్లాడారని మరి ఆ విషయానికి వస్తే గుడివాడ గురునాథ్ రావు గారి ఉన్నపుడు కాంగ్రెస్ లో అయన తదనంతరం తెలుగుదేశం లో 2014 ఎన్నికలకు ముందు వైసీపీ లో చేరిన జెండా కూలి కుటుంబం మీది కదా అసలైన జెండా కూలి కుటుంబ మీదే, ఈ రాష్ట్రం లో జరుగుతున్నా రాక్షస పాలన అంతం చేయాలనీ టీడీపీ - జనసేన - బీజేపీ కూటమితో ఎన్నికలకు వెళ్తాను అంటే ఎందుకు ఉలిక్కి పడుతున్నారన్నారు 175/175 గెలిచేస్తాం అని మీ అధికనాయకుడు చెప్పిన మాట మీద మీకు నమ్మకం ఉంటే ఎందుకు కంగారు పడుతున్నారన్నారు. జగన్ మోహన్ రెడ్డి పాలనలో 4 సమస్యల ఉంటే చూపించాలని మంత్రి అమర్ అడుగుతున్నారు 4 సమస్యలు కాదు 400 సమస్యలు చూపిస్తాం జనసేన పార్టీగా మీరి సిద్ధమేనా, రాష్ట్రం వరకు అవసరం లేదు మంత్రి అమర్ తన సొంత నియోజకవర్గం ఐన అనకాపల్లి వేదికగా వున్నా వైసీపీ వైఫాల్యలు కూడా 40 కి పైగా చెప్తాం మరి చర్చకు సిద్ధమేనా, జనసైనికులకు, నాయకులు ఉచిత సలహాలు ఇస్తున్న మంత్రి అమర్నాథ్ ముందు తన సంగతి ఏంటో చూసుకోవాలన్నారు.

# తెలంగాణ విద్యుత్ సంస్థలో పీఆర్సీ చిచ్చు

**హైదరాబాద్ :**

తెలంగాణ విద్యుత్ సంస్థల్లో పని చేసే ఉద్యోగుల్లో స్తబ్దత నెలకొంది. గత మూడు, నాలుగు నెలలుగా ఉద్యోగులు తమకు న్యాయంగా రావాల్సిన పీఆర్సీ కోసం యాజమాన్యంపై ఉద్యమించారు. విద్యుత్ ఉద్యోగులు సమ్మెకు కూడా సిద్ధమయ్యారు. ట్రాన్స్ కో, జెన్కో సీఎండీ ప్రభాకర్ రావుతో పలుమార్లు విద్యుత్ ఉద్యోగుల పీఆర్సీ జేఏసీ చర్చలు జరిపింది. 30 నుంచి 40 శాతం పీఆర్సీ ఇవ్వాలని ఉద్యోగ సంఘాలు భీష్మించుకుని కూర్చున్నాయి. ప్రస్తుతం సంస్థ ఆర్థిక పరిస్థితి బాగోలేదని? పీఆర్సీ అంత ఇవ్వలేమని సంస్థ యాజమాన్యం స్పష్టం చేసింది. అయితే ఉద్యోగులు, యాజమాన్యాన్ని కాదని ప్రభుత్వ పెద్దలను ఆశ్రయించారు. మంత్రి జగదీష్ రెడ్డితో చర్చలు జరిపారు. అక్కడ కూడా అలాంటి ప్రపోజల్ రావడంతో సమ్మెకు వెళ్తామని పీఆర్సీ జేఏసీ స్పష్టం చేసింది. ఉద్యోగులు సమ్మెకు వెళ్ళొద్దని యాజమాన్యం ఆదేశించింది. ఈ విషయంలో సీఎండీ ప్రభాకర్ రావు, యూనియన్ నేతల మధ్య తీవ్ర స్థాయిలో భేదాభిప్రాయాలు ఏర్పడ్డట్లు సమాచారం. ముఖ్యమంత్రి కూడా సీఎండీ ప్రభాకర్ రావు పై అసంతృప్తి వ్యక్తం చేసినట్లు ఉద్యోగ సంఘాల నేతలు తెలిపారు. ఉద్యోగుల పీఆర్సీ అంశాన్ని ఎటూ తేల్చకుండా నాన్చుడు ధోరణి అవలంబించారని ఆగ్రహం వ్యక్తం చేసినట్లు విద్యుత్ సౌధలో ఉద్యోగులు చర్చించు కుంటున్నారు. అయితే చివరికి యాజమాన్యం చెప్పిన 7 శాతం పిఆర్సీతో పాటు పలు ఆర్థిక పరమైన అంశాలకు జేఏసీ నేతలు సమ్మతించారు. ఇదిలావుంటే, ఆర్టిజెన్స్ కూడా సమస్యలను పరిష్కరించాలని సమ్మెకు పిలుపునిచ్చారు. యాజమాన్యం వద్దని వారించినా వెనక్కి తగ్గలేదు. మూడు రోజుల పాటు సమ్మెకు దిగారు. సమ్మె విషయంలో ట్రాన్స్ కో, జెన్కో సీఎండీతో పాటు ఎన్పిడిసియెల్, ఎస్పీడిసియెల్ సీఎండీలు సైతం ఉద్యోగ సంఘాలపై ఆగ్రహం వ్యక్తం చేశాయి. అయినా కార్మిక సంఘాల నేతలు బలవంతంగా కార్మికులతో సమ్మె చేయించారు. ఎస్మా ప్రయోగించి సుమారు 300 మంది కార్మికులను విధుల్లో నుంచి తొలగించింది యాజమాన్యం. ఇప్పుడు ఆ కార్మికులు రోజూ సీఎండీల కార్యాలయాల చుట్టూ తిరుగాల్సిన పరిస్థితి ఏర్పడింది. యాజమాన్యం మిగతా కార్మికులపై చర్యలు తీసుకోబోమని స్పష్టం చేసింది. ఉద్యోగాలు కోల్పోయిన వారు తమను క్షమించండి అని వేడుకోవాల్సిన దుస్థితి నెలకొంది. ఈనేపథ్యంలో సమ్మె ముగిసింది. యాజమాన్యం, అధికారులు, ఉద్యోగులు, కార్మికుల మధ్య గ్యాప్ పెరిగింది. గతంలో విద్యుత్ ఉద్యోగుల విభజన ఉద్యోగ సంఘాల నేతలకు, యాజమాన్యంకు మధ్య గ్యాప్ తెచ్చింది. యాజమాన్యం పై యూనియన్ నేతల మితిమీరిన వ్యాఖ్యలకు సీఎండీ నొచ్చుకున్నారు. తెలంగాణ ఉద్యోగులు తెలంగాణలో, ఆంధ్ర ఉద్యోగులు ఆంధ్రలోనే పని చేయాలి? తెలంగాణ విద్యుత్ ఉద్యోగులకు ప్రమోషన్స్ ఇవ్వాలనే డిమాండ్ అప్పట్లో తెరమీదకు తెచ్చారు. అప్పటికే ఆ యూనియన్లపై ముఖ్యమంత్రి కేసీఆర్ దగ్గర మంచి అభిప్రాయం ఉండటంతో సీఎండీ కూడా ఆ యూనియన్ నేతల మాటకు విలువిస్తూ వచ్చారు. ఒకానొక దశలో విభజన సమస్యల పై ఇరు రాష్టాల ముఖ్యమంత్రుల సమావేశంలో సీఎండీ ప్రభాకర్ రావు తెలంగాణ విద్యుత్ ఉద్యోగులకు అన్యాయం జరిగే సహించేది లేదని ఖరాకండిగా చెప్పిన పరిస్థితి. అయితే ఇలా సంవత్సరాలు గడిచాయి. ఉద్యోగుల విభజన సమస్యల పై విద్యుత్ యాజమాన్యాలు, ఇంజినీర్స్ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. న్యాయస్థానం జస్టిస్ ధర్మాధికారి కమిటీని నియమించింది. చివరకు ధర్మాధికారి కమిటీ తుది తీర్పు కూడా వెల్లడించింది. తెలంగాణ ఇంజినీర్స్, యాజమాన్యాలకు వ్యతిరేకంగా తీర్పు వెలువరించింది. ఇన్ని సంవత్సరాల్లో ఉద్యోగ సంఘాలు, యాజమాన్యం కలిసి సుమారు వంద కోట్ల రూపాయలు కోర్టు పనుల కోసం ఖర్చు చేశాయి. ఇంత చేస్తే ఇంజినీర్స్ కు న్యాయం జరిగాక పోగా? వందలాది మంది ఏపీ ఉద్యోగులు తెలంగాణకు కేటాయించారు. నిజానికి వారికి గడిచిన ఆరేళ్లుగా కూర్చో బెట్టి లక్షల జీతాలు చెల్లించాయి తెలంగాణ విద్యుత్ సంస్థలు. జస్టిస్ ధర్మాధికారి తుది తీర్పు తరువాత తెలంగాణ ట్రాన్స్ కో, జెన్కో సీఎండీ ప్రభాకర్ రావు ఆ యూనియన్ నేతల మాయ నుంచి బయటకు వచ్చారని తెలుస్తోంది. ఉద్యోగుల విభజన విషయంలో కోర్టు తీర్పు ఇచ్చిన తరువాత సదరు యూనియన్లు విద్యుత్ సౌధాలో ఒక సమావేశం ఏర్పాటు చేసి విద్యుత్ సంస్థల యాజమాన్యం, సీఎండీలు, డైరెక్టర్లపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. దీంతో సీఎండీ ఉద్యోగ సంఘాల నేతల వ్యాఖ్యలపై నొచ్చుకుని వారిని దూరం పెట్టారు. తాజాగా మళ్ళీ అదే పరిస్థితి విద్యుత్ సంస్థల్లో నెలకొంది. యూనియన్లు, సీఎండీలను టార్గెట్ చేస్తున్నట్లు తెలుస్తోంది. సీఎండీలు ఆ పదవులకు అనర్హులని ఉద్యోగ సంఘాల నేతలు తేల్చి చెబుతున్నారు. 60 ఏళ్లకు పదవీ విరమణ చేసిన వారిని 75 ఏళ్ళు వచ్చినా ఇంకా పదవుల్లో కొనసాగిస్తే ఇలాంటి సమస్యలే వస్తాయని వాపోతున్నారు. సరైన సమయంలో సరైన నిర్ణయాలు తీసుకోక పోవడం వల్ల సంస్థకే నష్టం వాటిల్లుతుందని నీతి సూత్రాలు చెబుతున్నాయి. విద్యుత్ సంస్థల్లో జరుగుతున్న పరిణామాలపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాలి.

# కన్నడ ఫలితాలతో గులాబీలో టెన్షన్

**హైదరాబాద్ :**

కర్ణాటక ఎన్నికల ఫలితాలు తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను నేలమీదకు దిగొచ్చేలా చేస్తున్నాయి. అధికార పార్టీపై వ్యతిరేకత చీలిపోతే గెలిచిపోదామని భావించే ఫార్ములా అన్ని సార్లూ జరగదు. బీజేపీని బలోపేతం చేయడంతో కాంగ్రెస్ గెలుపునకు అడ్డుకట్ట వేయవచ్చన్నది ఇప్పటి వరకూ కేసీఆర్ వ్యూహం. కానీ కర్ణాటక ఎన్నికల ఫలితాల తర్వాత ఆ ఆలోచన సరైనది కాదని తేలింది. ప్రజలు ప్రభుత్వంపై విసుగెత్తితే మూకుమ్మడిగా ఒక పార్టీకే పట్టం కడతారన్నది కర్ణాటక ఫలితాల ద్వారా స్పష్టమయింది. వ్యతిరేకత ఉన్నప్పుడు ప్రజలు కులం చూడరు. మతపరమైన పాచికలు పారవన్నది స్పష్టమైంది. నియంతలా వ్యవహరించిన తీరుకు ఒక రాష్ట్రాన్నే ప్రజలు కాంగ్రెస్‌కు అప్పగించారు. ఒక ఎంపీ పదవి తీసిస్తే.. ఒక్క రాష్ట్రాన్ని ఇవ్వగలిగిన శక్తి ప్రజలకు ఉందన్న సంగతి రాజకీయ పార్టీలకు ఈపాటికి అర్థమై పోయి ఉంటుంది. నియంత పోకడలు, ఏకపక్ష నిర్ణయాలు ఇక చెల్లవు. విగ్రహాలు పెట్టడం, కొత్త కొత్త స్కీములతో కొన్ని సామాజికవర్గాలను ఆకట్టుకోవాలనుకుంటే వాళ్లు వేయరు. మిగిలిన సామాజికవర్గాలు దూరమవుతాయన్న విషయాన్ని మహా నేతలు గుర్తుంచుకుంటే మేలన్న కామెంట్స్ సోషల్ మీడియాలో వినిపిస్తున్నాయి. బెంగళూరు నగరంలో వరదలు ముంచెత్తి అన్ని కాలనీలు మునిగిపోవడం, రహదారులు నదులను తలపించిన తరహాలోనే హైదరాబాద్ నగరంలోనూ వర్షం వస్తే సేమ్ సీన్. నగర ఓటర్లు ఈసారి ఎటు వైపు మొగ్గు చూపుతారనో టెన్షన్ కొంత బీఆర్ఎస్‌లో బయలు దేరింది.. ప్రజల్లో తిరగకుండా ప్యాలెస్‌లకే పరిమితం అయ్యేరాజకీయ నేతలకు కర్ణాటక ఫలితాలు ఒక చెంపపెట్టు లాంటివి. కన్నడ నాట ఏకంగా పదమూడు మంది మంత్రులను ప్రజలు ఇంటి దారి పట్టించారు. ఇతర పార్టీల నుంచి తెచ్చుకుని ఉప ఎన్నికల్లో గెలిపించుకున్నా సరే... ప్రజలు సాధారణ ఎన్నికల్లో ఆ పార్టీని పక్కన పెట్టారు. తెలంగాణలోనూ ముఖ్యమంత్రి కేసీఆర్ నియంతలా వ్యవహరిస్తున్నారని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఆర్టీసీ కార్మికుల సమ్మె విషయంలో అదే చేశారు. ఇప్పుడు జూనియర్ పంచాయతీ కార్యదర్శులను కూడా పక్కన పెట్టేందుకు సిద్ధమయింది. ఇలాంటి నియంత పోకడలను ప్రజలు హర్షించరు. తొమ్మిదేళ్ల పాటు అధికారంలో ఉన్న కేసీఆర్ సర్కార్‌పై సహజంగా ఎంతో కొంత అసంతృప్తి ఉంటుంది. అంతేకాకుండా సెంటిమెంట్‌లు అన్ని సార్లూ పనిచేయవు. కన్నడనాట హనుమంతుడు కూడా బీజేపీని రక్షించలేకపోయాడు. ఉద్యమ పార్టీ రాజకీయాపార్టీగా మారినట్లుగానే, అధికార పార్టీని ప్రతిపక్ష పార్టీగా మార్చగల సత్తా ఒక్క ప్రజలకే ఉంటుందన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి. కేవలం సర్వేల మీద ఆధారపడి, సిట్టింగ్‌లను మార్చుకుంటే ప్రజలు కూడా ముఖ్యమంత్రి సీటును వేరే వారికి అప్పగించేందుకు ప్రజలు సిద్ధమవుతారు. కేసీఆర్‌కు ఇప్పుడు కర్ణాటక ఫలితాల కలవరం పట్టుకుంది. వ్యతిరేకతను తగ్గించుకోవడానికి, మరోసారి అధికారంలోకి వచ్చేందుకు ఏమేం చేయాలో ఇప్పుడు వేరే ఆలోచన గులాబీ బాస్ చేయాల్సి ఉంటుంది. అంతే తప్ప ఇప్పటి వరకూ వేసుకున్న అంచనాలు, వ్యూహాలు మాత్రం పనిచేయవనే కర్ణాటక ఫలితాలు చూసి అర్థమయిందంటున్నారు.

# హై కమాండ్ కే పూర్తి బాధ్యతలు

**బెంగళూరు:**

సీఎం కుర్చీ కోసం హోరాహోరీగా తలపడుతున్నారు సిద్ధరామయ్య అండ్ డీకే శివకుమార్. ఇద్దరి మధ్య స్నేహసంబంధాలే ఉన్నా.. స్నేహం స్నేహమే.. సీఎం కుర్చీ సీఎం కుర్చీయే అంటున్నారు. హాట్ సీట్ కోసం ఇద్దరు ఒక రేంజ్‌లో లాబీయింగ్ చేస్తున్నారు. కర్నాటక సీఎం పంచాయితీ ఇప్పుడు ఢిల్లీకి చేరింది. కర్నాటక నెక్ట్స్ ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ సీనియర్ నేత సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రిగా ఆ పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు డీకే శివకుమార్ ఉంటారని కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది. దక్షిణాదిలో జరిగిన కీలకమైన అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ అద్భుతమైన విజయం సాధించింది. ఇప్పటి వరకు ఢిల్లీ కాంగ్రెస్ పార్టీ వర్గాల నుంచి అందుతున్న సమాచారం ప్రకారం, పార్టీ అధ్యక్షుడు నియమించిన కాంగ్రెస్ పరిశీలకులు ఢిల్లీలో సమావేశమయ్యారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, సోనియా గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా, రాహుల్ గాంధీలతో కూడిన కేంద్ర నాయకత్వంతో చర్చలు జరుపుతున్నారు. ఇందులో ముఖ్యమంత్రిగా సిద్ధరామయ్య, అతని డిప్యూటీగా డీకే శివకుమార్‌కు ఇవ్వాలని నిర్ణయం వైపుగా చర్చలు జరుగుతున్నట్లుగా తెలుస్తోంది. కర్ణాటక కాంగ్రెస్ సీఎల్పీ భేటీ బెంగళూరులో రసవత్తరంగా సాగింది. సీఎల్పీ భేటీలో కాబోయే సీఎం ను ఎన్నుకోవాలని ఎమ్మెల్యేలను కాంగ్రెస్ అధిష్ఠానం కోరగా... ఎమ్మెల్యేలు ఏకవాక్య తీర్మానం ఇచ్చారు. కర్ణాటకు కొత్త సీఎంను ఎన్నుకోవాల్సిన బాధ్యతను కాంగ్రెస్ హై కమాండ్ కే అప్పగిస్తున్నట్లు ఎమ్మెల్యేలంతా ఏక వాక్య తీర్మానం చేయడంతో కొత్త సీఎం ఎంపికపై ఉత్కంఠ కొనసాగుతోంది. ఈమేరకు డీకే శివకుమార్ లేదా సిద్ధరామయ్యలో ఎవరు సీఎం కావాలనేది హైకమాండ్ నిర్ణయించనున్నట్లు తెలుస్తోంది. సీఎల్పీ పార్టీకి కొత్త అధ్యక్షుడిని నియమించడంపై ఏఐసీసీ అధ్యక్షుడికి అధికారం ఇస్తూ సింగిల్‌లైన్ తీర్మానాన్ని మాజీ సీఎం సిద్దరామయ్య ప్రవేశపెట్టారు. ఈ తీర్మానాన్ని డీకే శివకుమార్ సహా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు అంతా ఏకగ్రీవంగా ఆమోదించారు. సీఎల్పీ భేటీ ముగిసిన అనం తరం కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్ ఈ విషయాన్ని తెలిపారు. ఎమ్మెల్యేల ఏకగ్రీవ తీర్మానాన్ని ఖర్గేకు వేణుగోపాల్ వివరించారు. అయితే ముగ్గురు సీనియర్ పరిశీలకులు పార్టీ ఎమ్మెల్యేల వ్యక్తిగత అభిప్రాయాలు తీసుకోవాలని, ఆ విషయాన్ని అధిష్టానానికి వెల్లడిస్తామని అన్నారు. అర్ధరాత్రి లోగా కాంగ్రెస్ పరిశీలకులు కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో వ్యక్తిగతంగా భేటీ అయ్యి వారి అభిప్రాయాన్ని సేకరించనున్నారు. చివరగా ఏ నేతను సీఎల్పీ అధ్యక్షుడిగా ఎన్నికోనున్నారో ఆ విషయాన్ని పార్టీ అధిష్టానానికి వివరించనున్నారు. అనంతరం ఢిల్లీ హై కమాండ్ కర్ణాటక కొత్త సీఎం ఎవరన్నది ప్రకటించనుంది. సిద్ధరామయ్య ఈ టర్మ్ తరువాత పాలిటిక్స్ నుంచి తప్పుకుంటారు. మరోవైపు కెరీర్ ప్రారంభించప్పటి నుంచి కాంగ్రెస్ లోనే కొనసాగుతున్న డీకే శివకుమార్ సైతం సీఎం పదవిపై ఆసక్తి చూపిస్తున్నారు. ఇప్పటివరకూ తాను ఎన్నో త్యాగాలు చేశానని పార్టీ అధిష్టానానికి గుర్తుచేశారు. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో మొత్తం 224 స్థానాల్లో కాంగ్రెస్ 135 సీట్లు కైవసం చేసుకుంది. కాగా, అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ 66 సీట్లు గెలుచుకుని రెండో స్థానానికి పరిమితం కాగా, జనతాదళ్ (సెక్యులర్) 19 స్థానాల్లో విజయం సాధించింది. అయితే ఎనిమిది సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన శివకుమార్, మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఇద్దరూ సీఎం రేసులో ఉన్నారు. కాంగ్రెస్ అధిష్టానం సైతం వీరిలో ఒకరిని సీఎంగా చేయాలని భావించింది. కానీ పార్టీకి విజయాన్ని అందించిన నేతల్లో పార్టీ ఎమ్మెల్యేల్లో మెజార్టీ నేతల నిర్ణయంతో సీఎంను ఎంపిక చేయాలని ఏఐసీసీ భావిం చింది. కానీ కొనసాగుతున్న సీఎల్పీ భేటీలో నేతలు ఏకపక్ష నిర్ణయం తీసుకున్నారు. ఏఐసీసీనే కొత్త సీఎం ఎవరన్నది నిర్ణయించాలని తీర్మానం చేయడంతో కర్ణాటక సీఎం పదవిపై సస్పెన్స్ వీడలేదుమరోవైపు చెరో రెండున్నరేళ్ల పాటు సీఎం పదవిని పంచుకోవాలని పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పంపిన తీర్మానాన్ని మాజీ సీఎం సిద్ధరామయ్య ఓకే చేసినట్లు తెలుస్తోంది. కానీ, డీకే శివకుమార్ ఖర్గే అందుకు నిరాకరించినట్లు సమాచారం. పార్టీ జాతీయ అధ్యక్షుడు ఖర్గే ప్రతిపాదనపై ఇద్దరు నేతలు సమ్మతించకపోవడంతో కర్ణాటక కొత్త సీఎం వ్యవహారం ఢిల్లీకి చేరనుంది. శివకుమార్, సిద్ధరామయ్యలను సోమవారం ఢిల్లీకి రావాల్సిందింగా హైకమాండ్ ఆదేశిస్తుందని బెంగళూరులో ప్రచారం జరుగుతోంది. రాహుల్ గాంధీ, ఖర్గేతో ఢిల్లీలో చర్చించిన తరువాత కర్ణాటక కొత్త సీఎం ఎవరో తేలనుందన్న వాదన సైతం వినిపిస్తోంది

ప్రజా తపన prajathapana.com

## తాతయ్య గుంట గంగమ్మ తల్లికి సారె సమర్పించిన ఆర్యవైశ్య సంఘం

**తిరుపతి**

తిరుపతి తాతయ్యకుంట గంగమ్మ జాతరలో భాగంగా స్థానిక ఆర్యవైశ్య సంఘం తరపున ఘనంగా పూజలు నిర్వహించి ఆర్యవైశ్య సంఘం భవనం నుండి పాదయాత్రగా వచ్చి నేల తాళాలు మంగళ వాయిద్యాలు నడుమ ఘనంగా ఆలయం వద్దకు చేరుకున్న ఆర్యవైశ్య సంఘం నేతలకు స్థానిక ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి ఆలయ అర్చకులు ఆలయ ఈవో, పోర్ట్ చైర్మన్ పూర్ణ కలశం తో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు మీడియాతో మాట్లాడుతూ ఆర్యవైశ్య సంఘం తరపున స్థానిక గంగమ్మ గుడి ఆలయంలో సారి సమర్పించడం జరిగింది. అంతేకాకుండా ఆలయ శిఖరం పై ఇదివరకు గోపురం కూడా సమర్పించడం జరిగినది అలాగే ఆర్యవైశ్య అందరి తరపున భగవంతుని ఇలాంటి కార్యాలు మరెన్నో చేయాలని భగవంతుని కోరుకుంటున్నాను తెలిపారు.

## గడప గడపకు మన ప్రభుత్వం

**నెల్లూరు**

ఉమ్మడి నెల్లూరు జిల్లా ఓజిలి మండలంలోని ఇనుగుంట సచివాలయం పరిధిలోని ఇనుగుంట, లింగారెడ్డి పల్లి, రావిపాడు గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యకు ప్రజలు, వైఎస్ఆర్సిపి నాయకులు అపూర్వ స్వాగతం పలికారు. గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలు వివరించి బుక్లెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాలనలో ప్రతి కుటుంబానికి సంక్షేమం అందుతుందని అన్నారు. ప్రజా రంజకంగా పాలన సాగిస్తున్న సీఎం జగన్మోహన్ రెడ్డికి ప్రజలంతా అండగా నిలిచి 2024 ఎన్నికల్లో మరో మారు ముఖ్యమంత్రిని చేసుకోవాలని కోరారు.

## ప్రేమజంట ఆత్మహత్య

**హైదరాబాద్**

కూకట్ పల్లిలో యువతీ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన కలకలం రేపింది. స్నేహితుడి ఇంట్లో ఉరేసుకుని ఆకుల శ్యామ్, పాయిజన్ సేవించి పోతుల జ్యోతి సూసైడ్ చేసుకున్నారు. ఐఖఊః ఏడో ఫేజ్‌లో ఘటన వెలుగు చూసింది. భీమవరం దగ్గర్లోని గొల్లవానితిప్పకు చెందిన ఇరువురు.. నగరంలో ఉంటున్న కృష్ణ అనే ఫ్రెండ్‌రూమ్‌కి వచ్చారు. పెళ్లికి వెళ్లొస్తానంటూ బయటకు వచ్చాడు కృష్ణ. తిరిగి ఇంటికి వెళ్లి చూడగా ఇరువురు విగతజీవులుగా కనిపించారు. సమాచారంతో పోలీసుల స్పాట్‌కు చేరుకుని.. డీటేల్స్ నమోదు చేసుకున్నారు.మృతదేహాలను పోస్ట్ మార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కాగా యువతికి గతంలోనే పెళ్లి కాగా.. విడాకులు తీసుకున్నట్లు తెలుస్తుంది. వీరిద్దరూ సమీప బంధువులుగా చెప్తున్నారు. పోలీసులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. విచారణ చేసిన అనంతరం పూర్తి వివరాలు చెబుతామన్నారు.

## సబ్ రిజిస్టర్ తో సహా సిబ్బంది ముకుమ్మడి బదిలీ

**బద్వేలు**



బద్వేల్ సబ్ రిజిస్టర్ శ్రీనివాస మూర్తితో సహా కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బందిని మూకుమ్మడిగా ఇతర ప్రాంతాలకు బదిలీ చేశారు బద్వేలు సబ్ రిజిస్టర్ కార్యాలయం అనేక అవినీతి అక్రమాలకు నిలయంగా మారింది తాజాగా ఏసీబీ అధికారులు దాడులు చేసినప్పుడు కార్యాలయంలో ఐదు లక్షల రూపాయల నగదు పట్టుబడింది సబ్ రిజిస్టర్ శ్రీనివాసమూర్తి పై ఏసీబీ కేసు నమోదు చేసిందిఈ నేపథ్యంలో సబ్ రిజిస్టర్ శ్రీనివాసమూర్తిని కడప ప్రాంతీయ కార్యాలయంలో చిట్స్ విభాగం సహాయ రిజిస్టర్ గా బదిలీ చేసి ఆయన స్థానంలో ముద్దనూరు సబ్ రిజిస్టర్ డి మహబూబాషాను డిప్యూటేషన్ పై బద్వేల్ లో నియమించారు సీనియర్ సహాయకుడు జె.వి రవి ప్రకాష్ ను అన్నమయ్య జిల్లా రాయచోటికి జూనియర్ సహాయకుడు పి నరేంద్రను కడప నగరంలోని సబ్ రిజిస్టర్ కార్యాలయానికి బదిలీ చేస్తూఉత్తర్వులు వెలుపడ్డాయి ఇలా ఇలా స్థాయిలోనూ ఉద్యోగులను బదిలీ చేసి వారి స్థానంలో కొత్తవారిని నియమించారు

## మైదుకూరులో పైలాన్ ఆవిష్కరణ

**శ్రీశైలం**



టీడీపీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్ర 100 రోజులు పూర్తయిన సందర్భంగా మోతుకూరు లో అయన పైలాన్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నారా భువనేశ్వరి, నందమూరి కుటుంబ సభ్యులు, టిడిపి సీనియర్ నేతలు, యువగళం పాదయాత్ర టీం పాల్గొన్నారు. 100 రోజుల పాదయాత్ర కు గుర్తుగా పార్టీ నేతలు 100 మొక్కలు నాటారు. సోమవారం ఉదయం టిడిపి కార్యకర్తల ఆనందోత్సాహాల నడుమ యువగళం 100వ రోజు పాదయాత్ర ప్రారంభమయింది. జైలోకేష్, జై తెలుగుదేశం నినాదాలతో పాదయాత్రహోరెత్తింది. కార్యకర్తలు పెద్దఎత్తున తరలిరావడంతో 3 కి.మీ. మేర ట్రాఫిక్ స్థంభించింది బాణాసంచా మోతలు, డప్పుల చప్పుళ్లు, నినాదాల హోరుతో జాతరను తలపించింది.

# ఆ నలుగురిలో ఎవరికి అవకాశం

**విజయవాడ :**

వల్లభనేని వంశీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి అనుబంధ ఎమ్మెల్యేగా మారిన తర్వాత నియోజకవర్గ పరిధిలోని తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు సమర్థుడైన నాయకుడి కోసం ఎదురు చూస్తున్నారు. పార్టీ అధినేత చంద్రబాబును కలిసి తమకు ఒక సమర్థుడైన నాయకుణ్ని వ్వాలని, మార్గదర్శనం చేయిమంటూ కోరారు. వంశీ పార్టీ మారిన తర్వాత ఎమ్మెల్సీ బచ్చుల అర్జునుడికి బాధ్యతలు అప్పగించినప్పటికీ అనారోగ్యంతో ఆయన కన్నుమూయడంతో పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది. అదే సమయానికి నియోజకవర్గ టీడీపీ కార్యాలయంపై వంశీ అనుచరులు దాడికి దిగారు. అనంతరం 27 మంది టీడీపీ నాయకులపై కేసులు నమోదయ్యాయి. కొనకళ్లకు బాధ్యతలు ఈ పరిణామాల తర్వాత పార్టీ అధినేత చంద్రబాబు బందరు మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణకు బాధ్యతలు అప్పగించడంతో పాటు సమన్వయ కమిటీని ఏర్పాటు చేశారు. కొనకళ్ల కూడా నియోజకవర్గ నాయకులకు పూర్తిస్థాయిలో అందు బాటులో ఉండటం కష్టమవుతోంది. దీంతో నియోజకవర్గంలోని తెలుగు తమ్ముళ్లు తమకు ఒక బలమైన నాయకుణ్ని ఇవ్వమని చంద్రబాబును కోరుతున్నారు. వైసీపీ నుంచి ఒక ముఖ్య నాయకుడు పార్టీలో చేరతారనే ప్రచారం నడుస్తున్నప్పటికీ ఆయన అదిగో.. ఇదిగో అంటూ వాయిదా వేస్తున్నారని చెబుతున్నారు. తాజాగా పార్టీ మార్పు అనేది ఆగస్టుకు వాయిదా వేశారు. చంద్రబాబు ఇటీవలి కృష్ణా జిల్లా పర్యటనలో రెండు నియోజకవర్గాలకు సంబంధించిన ఏర్పాట్లు దాసరి జైరమేష్, దాసరి బాలవర్ధన్ రావు సోదరులు చూశారు. ప్రస్తుతం వీరు వైసీపీలో ఉన్నారు. టీడీపీలోకి వస్తారనే ప్రచారం నడుస్తున్నప్పటికీ దాసరి జైరమేష్ గన్నవరం నుంచి పోటీచేసేందుకు సుముఖంగా లేరని తెలుస్తోంది. మరోవైపు తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవినేని చందు గన్నవరం నుంచి తన తల్లి దేవినేని అపర్ణ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలతో వీరు సమావే శమై సహకరించాలని కోరగా పార్టీ ఆదేశాలు వస్తే సహకరిస్తామని వారు హామీ ఇచ్చారు. వాటర్ కూలర్ల పంపిణీ తాజాగా వీరు ప్రార్థనా మందిరాలకు చెందిన పాస్టర్లతో సమావేశమై 40 మందికి వాటర్ కూలర్లు పంపిణీ చేశారు. రెండు అన్న క్యాంటిన్లు ఏర్పాటు చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. ఎన్టీఆర్ జిల్లాలో కేశినేని ఫౌండేషన్ తరఫున కేశినేని చిన్ని, గుడివాడలో ఎన్నారై వెనిగండ్ల రాము తరహాలో సేవా కార్యక్రమాలకు ప్రణాళిక రూపొందిం చుకుంటున్నారు. త్వరలోనే ఇన్ ఛార్జి నియామకం ఉంటుందికాబట్టి ఇది తమకు కలిసివస్తుందని భావిస్తున్నారు. పార్టీ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభి కూడా వచ్చే ఎన్నికల్లో గన్నవరం నుంచి పోటీచేయడానికి అవకాశం కోసం ప్రయత్నిస్తున్నారు. మరి చంద్రబాబు ఎవరికి అవకాశం కల్పిస్తారో? ఎవరు నియోజకవర్గంలో పార్టీని విజయతీరాలకు చేరుస్తారో చూడాల్సి ఉంది.

# హాట్ టాపిక్ గా మారిన బాలినేని

**ఒంగోలు :**

మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస్ రెడ్డి ఇష్యూ అధికార వైసీపీలో ప్రకంపనలు సృష్టిస్తోంది. రీజనల్ కో ఆర్డినేటర్ పదవికి రాజీనామా చేయటంపై జోరుగా చర్చ సాగుతోంది. ఏడాది క్రితం జరిగిన క్యాబినెట్ విస్తరణలో మళ్లీ తనకు చోటు దక్కలేదని తీవ్ర అసంతృప్తికి గురయ్యారు బాలినేని. ఆయన అనుచరులు హంగామా చేయటం, సజ్జల లాంటి వ్యక్తి బాలినేని ఇంటికి రెండు మూడు దఫాలు తిరిగి బుజ్జగించటం చకచకా జరిగిపోయాయి. ఆ తర్వాత సీఎం జగన్ సైతం క్యాంపు ఆఫీసుకు బాలినేనిని పిలిపించుకొని స్వయంగా మాట్లాడారు. దీంతో అప్పట్లో బాలినేని అలకపాన్పు దిగారు. తాజాగా సీఎం జగన్ సభలో ప్రొటోకాల్ అంశం బాలినేనిలో అసంతృప్తికి కారణం అయ్యిందనే చర్చ జరుగుతోందట.ఐతే ఈ ఎపిసోడ్ బాలినేనికి మాత్రమే పరిమితం కాదన్నది వైసీపీ సీనియర్ నేతల టాక్. జిల్లా పార్టీ అధ్యక్ష బాధ్యతలు, రీజనల్ కో ఆర్డినేటర్‌గా పార్టీ వ్యవహారాలు చక్కబెట్టడం అంత తేలిక కాదంటున్నారు. ఎన్నికల ఏడాది నియోజవకవర్గాన్ని చూసుకోకపోతే గ్రౌండ్‌లో నష్టపోతామన్నది పార్టీ నేతల వాదనగా తెలుస్తోంది. ప్రస్తుతం ఉన్న 12 మంది రీజనల్ కో ఆర్డినేటర్లలో ఇద్దరు మంత్రులు ఉంటే మిగిలిన వారు ఎంపీ, ఎమ్మెల్యే లాంటి ఇతర బాధ్యతలు ఉన్న వారే. దీంతో చాలామంది రీజనల్ కో ఆర్డినేటర్ బాధ్యతకు న్యాయం చేయటం లేదన్న విమర్శా..ఉంది. రీజనల్ కోఆర్డినేటర్లు గానూ, జిల్లా అధ్యక్షులుగాను పని తీరు సరిగా లేకపోవటంతోనే గతంలో అధినేత జగన్?.కొడాలి నాని, సజ్జల రామకృష్ణా రెడ్డి వంటి వారిని పక్కకు తప్పించారు. పని చేసే వారికే పోస్టులు అనే మెసేజ్‌ను జగన్ చాలా స్పష్టంగా పార్టీ నాయకుల్లోకి పంపించారు.ఇక?ఆ తర్వాత కూడా నేతల్లో పెద్దగా మార్పు రాలేదన్న చర్చ పార్టీ వర్గాల్లో జరుగుతోంది. సీనియర్ నేతలైన బొత్స సత్యనారాయణ, పెద్దిరెడ్డి వంటి వారు మాత్రం కాస్త రెగ్యులర్‌గా తమ పరిధిలోని జిల్లాల నేతలతో సమావేశాలు పెట్టుకోవటం, గ్రూపు తగాదాలు ఉంటే సర్దుబాటు చేసే ప్రయత్నం చేస్తున్నారు. ఆళ్ళ, అయోధ్య రామిరెడ్డి, పిల్లి సుభాశ్ చంద్రబోస్, ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి వంటి కొంత మంది నేతలు సమీక్షల జోలికే వెళ్లటం లేదన్న విమర్శ ఉంది. బాలినేని కూడా అంటీ ముట్టనట్లు వ్యవహరించే నాయకుల జాబితాలోని వారే. పార్టీ జిల్లా అధ్యక్షులు, రీజనల్ కోఆర్డినేటర్లు ఎప్పటికప్పుడు తమ పరిధిలోని జిల్లాల్లో పర్యటించాల్సి ఉంటుంది. నాయకుల మధ్య సమన్వయం వచ్చేటట్లు చూడాలి. పార్టీ పిలుపునిచ్చే కార్యక్రమాలను క్షేత్ర స్థాయిలో బలంగా తీసుకుని వెళ్లాలి. ఈ పనులన్నీ చూడటం కొంతమంది నేతలకు తలకు మించిన భారంగా మారుతోందట. మాకొద్దు బాబోయ్ ఈ బరువు అంటున్నారని టాక్. కొన్ని చోట్ల వీళ్ల మాటను ఖాతరు చేయని పరిస్థితులు ఉన్నాయని సమాచారం. మరోవైపు?తాను గెలిచి ఎంపీనో, ఎమ్మెల్యేనో అయితే చాలు పార్టీ ఎలా పోతే తనకేంటి అనే నేతల వైఖరిపై పార్టీ పెద్దలు ఆశ్చర్యపోతున్నారని ప్రచారం జరుగుతోంది. పార్టీ క్షేత్ర స్థాయిలో బలంగా లేకపోతే వచ్చే ఎన్నికల్లో ప్రత్యర్థులను ఎలా ఎదుర్కొంటామన్న ఆలోచన లేకుండా?బాధ్యతల నుంచి తప్పించుకోవటానికి సీనియర్ నేతలు సైతం సాకులు వెతుక్కోవటాన్ని పార్టీ శ్రేణులు తప్పుబడుతున్నాయట. బాలినేని బాటలో ఇంకా ఎవరైన ఉన్నారా?నేతల సాకులకు అధినేత ఎలాంటి ట్రీట్‌మెంట్ ఇస్తారన్న చర్చ జరుగుతోంది.

# ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి

**బద్వేలు**

ఉపాధి హామీ పథకం కూలీల సమస్యలు పరిష్కరించడం వారికి కనీస సౌకర్యాలు కల్పించలేకపోవడం సిగ్గుచేటని సిపిఐ బద్వేలు మండల కార్యదర్శి నాగ దాసరి ఇమ్మానుయేలు పేర్కొన్నారు ఉపాధి కూలీల సమస్యల పరిష్కారం కొరకు సిపిఐ బద్వేల్ మండల సమితి తలపెట్టిన పర్యటనలో భాగంగా మొదటి రోజు సోమవారం బద్వేల్ రూరల్ ప్రాంతంలోని తిప్పనపల్లె సమీపంలో ఉపాధి హామీ పథకం కూలీలు పనిచేస్తున్న ప్రదేశం వద్దకు వెళ్లి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు ఈ సందర్భంగా ఇమ్మానుయేలు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో కూలీలకు వంద రోజుల పని కల్పించాలనే ఉద్దేశంతో గత కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ పథకాన్ని ప్రవేశపెట్టిందని వారన్నారు ప్రస్తుత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఈ పథకానికి తూట్లు పొడుస్తున్నారని వారు తెలిపారు వ్యవసాయ భూములలో కాలువలు ప్రజలకు ఉపయోగపడే ప్రదేశంలో పనులు చేపట్టకుండా చెరువులలో గుంతలు తీయడం ఏంటని వారన్నారు అంతేకాకుండా పని ప్రదేశంలో మాకు ఎలాంటి సౌకర్యాలు లేవని అడిగితే మమ్మల్ని ఎక్కడ ఇబ్బంది పెడతారో అని అడగలేని పరిస్థితి అని కూలీలు వాపోతున్నారు బద్వేలు మండలం రూరల్ పరిధిలో అన్ని పంచాయతీలలో ఉపాధి హామీ పథకం కూలీలు పనిచేస్తున్న ప్రదేశాలను సందర్శించి వారి సమస్యలను తెలుసుకొని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు అయినప్పటికీ పట్టించుకోకపోతే ఉపాధి కూలీలను పెద్ద ఎత్తున సమీకరించి ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని వారు హెచ్చరించారు ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు శేఖర్ ప్రసాద్ జయన్న తదితరులు పాల్గొన్నారు

# ప్రతీ కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటాం


**చొప్పదండి**



బీఆర్ఎస్ పార్టీ ప్రమాద బీమా రెండు లక్షల రూపాయల చెక్కును ఇంటికి వెళ్లి చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అందజేశారు.జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం దమ్మయ్యపేట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త రొడ్డవేణి రమేష్ గత కొద్ది నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో చనిపోయారు.అతనికి పార్టీ సభ్యత్వ ప్రమాద బీమా ఉండటంతో ప్రమాద బీమా చెక్కు మంజూరు అయ్యింది..ఈ సందర్భంగా మంజూరు అయిన చెక్కును ఎమ్మెల్యే వారి కుటుంబ సభ్యులకు సోమవారం ఎమ్మెల్యే సుంకే రవిశంకర్ చేతుల మీదుగా అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే రవిశంకర్ మాట్లాడుతూ...పార్టీ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని అన్నారుబీ ఆర్ ఎస్ పార్టీ కార్యకర్తల సంక్షేమం కోసం పార్టీ ఇన్సూరెన్స్ ను కార్యనిర్వాహక అధ్యక్షులు మంత్రి కేటీఆర్ ప్రవేశపెట్టారని తెలిపారు.కష్టపడే ప్రతి కార్యకర్తలను కుటుంబ సభ్యుడిగా చూసుకుంటానని అన్నారు.

## ఘోర రోడ్డు ప్రమాదం ఏడుగురు మృతి

**కడప**



జిల్లాలోని కొండాపురం దగ్గర ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. తుఫాన్ వాహనాన్ని లారీఢీకొన్న ప్రమాదంలో ఏడుగురు మృతి చెందగా మరో ఆరుగురికి గాయాలయ్యాయి. తుఫాన్ వాహనంలో తిరుమల నుంచి తాడిపత్రి వెళ్తుండగా ఘటన చోటుచేసుకుంది. ప్రమాదం సమయంలో తుఫాన్ వాహనంలో 13 మంది వున్నారు. మృతులు తాడిపత్రి, బళ్లారికి చెందినవారుగా గుర్తించారు. ప్రమాద సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకున్నారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు.

## బీసీ భవన్ లో రాష్ట్రస్థాయి కవి సమ్మేళనం

**హైదరాబాద్**

హైదరాబాద్ విద్యానగర్లోని బీసీ భవన్ లో ఈనెల 16న సాయంత్రం 4 గంటల నుండి వసంతోత్సవ రాష్ట్రస్థాయి కవిత సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నట్లు తెలంగాణ కవుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు సుతారపు వెంకటనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య తో పాటు ప్రముఖ సాహితీ వేత్తలు హాజరవుతున్నట్లు తెలిపారు. కవులు కవయిత్రులు ఈ కార్యక్రమానికి సకాలంలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## కారు, బస్సు ఢీ..ఒకరు మృతి

**నల్గోండ**

నల్గొండ జిల్లా చిట్యాల శివారులో జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. విజయవాడ నుండి హైదరాబాద్ వైపు వెళుతున్న కారు అదుపుతప్పి డివైడర్ను ఢీకొని, ఎదురుగా హైదరాబాద్ నుండి నల్గొండకు వెళుతున్న ఆర్టీసీ బస్సును ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయి. బస్సులో ప్రయాణిస్తున్న డ్రైవర్ తో పాటు మరో ఐదుగురికి స్వల్ప గాయాలు కాగా గాయపడిన వారందరినీ ఆసుపత్రికి తరలించారు.

## కాంట్రాక్టర్ పై ఎమ్మెల్యే అనుచరుడి దాడి

**మల్కాజిగిరి**

వినాయక్ నగర్ 137వ డివిజన్ పరిధిలో రోడ్ మరమ్మత్తులు పనులు చేస్తున్న కాంట్రాక్టర్ పై బిఆర్ఎస్ మల్కాజిగిరి సర్కిల్ వైస్ ప్రెసిడెంట్ బజార్ సాయి దాడికి పాల్పడ్డాడు. తమ ప్రమేయం లేకుండా పనులు ఎలా చేస్తారని, స్థానిక బిజెపి మహిళా కార్పొరేటర్ ని అసభ్య పదజాలంతో దూషిస్తూ తనపై దాడి చేసాడని సూపర్వైజర్ శశాంక్ నేరేడ్మెట్ పోలీసులకు ఫిర్యాదు చేసాడు. తమ పనులకు ఆటంకం కలిగించి దాడికి పాల్పడ్డ టిఆర్ఎస్ నాయకుడిపై చర్యలు చేపట్టాలని కాంట్రాక్టర్ అసోసియేషన్ మల్కాజిగిరి డిప్యూటీ కమిషనర్ కి కూడా ఫిర్యాదు చేసారు. తక్షణమే బిఆర్ఎస్ నాయకుడు సాయి గౌడ్ పై కేసు నమోదు చేయాలని , లేని పక్షంలో మల్కాజిగిరి సర్కిల్ వ్యాప్తిగా పనులు నిలిపివేస్తామని హెచ్చరించడం జరిగింది.

## షాద్ నగర్ లో భట్టీ పాదయాత్ర

**రంగారెడ్డి**

రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గ పరిధిలో చౌదరి గూడ మండలంలో మూడో రోజు బట్టి విక్రమార్క పాదయాత్ర కొనసాగింది. ఈ సందర్భంగా పరిగి మండలం తొండపల్లి గ్రామం మీదుగా లక్ష్మీ దేవి పల్లి ప్రాజెక్టు వద్దకు పాదయాత్ర కొనసాగింది..లక్ష్మీ దేవి పల్లి ప్రాజెక్టు వద్ద మహిళలు బోనాలతో స్వాగతం పలికారు.. మరి కాసేపట్లో లక్ష్మీదేవి పల్లి ప్రాజెక్టు ను ఉద్దేశించి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ప్రజా సంఘాల మేధావుల ఆధ్వర్యంలో మాట్లాడారు.

## రహదారిపై రైతుల నిరసన

**జగిత్యాల**

జగిత్యాల అర్బన్ మండలం తిప్పన్నపేట ఐకెపి సెంటర్ వద్ద జగిత్యాల - ధర్మపురి ప్రధాన రహదారిపై బస్తాలు వేసి వాటి పై కూర్చొని రైతులు నిరసన తెలిపారు. 30 రోజులైనా కొనుగోలు కేంద్రాల్లో పోసిన ధాన్యం కొనుగోలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అకాల వర్షాల వల్ల ఇప్పటికే రైతులు తీవ్రంగా నష్టపోతే అధికారులు కొనుగోళ్ళు వేగవంతం చేయకపొవడంతో ఇబ్బందులను ఎదుర్కొంటున్నామన్నారు.

## ఆటోను ఢీకొన్న లారీ

**అదిలాబాద్**

అదిలాబాద్ జిల్లా తాంసి మండలం పొన్నారి వద్ద ఆటోను ఒక లారీ ఢీకొంది. ఘటనలో ఏడుగురికి తీవ్ర గాయాలు అయ్యాయి. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా వుంది. స్థానికులు, పోలీసులు క్షతగాత్రులను రిమ్స్ కు తరలించారు. గాయపడ్డ వారందరూ గుడిహత్నూర్ మండలం శాంతాపూర్ కు చెందిన కూలీలు. వీరంతా పొన్నారి గ్రామానికి కూలి పనికి వెళుతుండగా ఘటన జరిగింది. రోడ్డు ప్రమాదంలో ఆటో పూర్తిగా నుజ్జునుజ్జెయింది. .

ప్రజా తపన
prajathapana.com

# చీఫ్ మినిస్టర్ కప్ ప్రారంభించిన ఎమ్మెల్యే



**జగిత్యాల**

జగిత్యాల పట్టణంలోని వివేకానంద మినీ స్టేడియంలో జగిత్యాల అర్బన్, రూరల్,మరియు మున్సిపల్ పరిదిలో సీఎం కప్ క్రీడా పోటీలను జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ జెడ్పీ చైర్పర్సన్ దావ వసంత సురేష్ లు క్రీడలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల శాసనసభ్యులు సంజీవ్ కుమార్ మాట్లాడుతూ, క్రీడాకారులు క్రీడల్లో రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. క్రీడాకారులకు తెలంగాణ ప్రభుత్వం ఎల్లవేళలా తోడుగా ఉంటుందని సంజీవ్ కుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత సురేష్ మాట్లాడుతూ, క్రీడాకారులను తెలంగాణ ప్రభుత్వము ప్రోత్సహిస్తుందని క్రీడాకారులు జాతీయస్థాయిలో రాణించి జగిత్యాల జిల్లాకు ఎన్నో విజయాలు సాధించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మెన్ గోలి శ్రీనివాస్,ఎంపీపీలు ములాసపు లక్ష్మి,పాలేపు రాజేంద్రప్రసాద్,జెడ్పీటీసీ మహేష్, స్థానిక కౌన్సిలర్ చుక్క నవీన్ రైతు బంధు సమితి మండల కన్వీనర్ నక్కల రవీందర్ రెడ్డి,పాక్స్ ఛైర్మెన్ సందీప్ రావు,జిల్లా కౌన్సిలర్ ఫోరం పంబాల రామ్ కుమార్, సర్పంచుల ఫోరం చెరుకు జాన్,ఎంపీటీసీ ల ఫోరం మహేష్,ఎమ్మార్వోలు,ఎంపిడిఓలు,ఎంపివోలు, అధికారులు,సర్పంచులు,ఎంపీటీసీలు,కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

# 17 నుంచి డబుల్ కోచ్

**తిరుపతి:**

సికింద్రాబాద్-తిరుపతి మధ్య నడిచే వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌కు ప్రయాణికుల డిమాండ్ ఎక్కువగా ఉండడంతో ట్రైన్ కోచ్‌ల సంఖ్యను రెట్టింపు చేయనున్నట్లు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. ఈ రైలులో ప్రస్తుతం 8 కోచ్‌లు ఉండగా, ప్రయాణికుల కోరిక మేరకు ఈ నెల 17వ తేదీ నుంచి 16 కోచ్‌లను ఏర్పాటు చేయబోతున్నామని కిషన్‌రెడ్డి తెలిపారు. ఇక ఇందులో 14 ఏసీ కోచ్‌లు, 2 ఎగ్జిక్యూటివ్ క్లాస్ కోచ్‌లు ఉండనున్నాయి. అలాగే సీట్ల సంఖ్య 530 నుంచి 1036కి పెరగనుంది.అయితే ప్రస్తుతం ఎగ్జిక్యూటివ్ చైర్ కార్‌లో 52 సీట్లు, చైర్‌కార్‌లో 478 సీట్లతో మొత్తం 530 సీట్లు ఉన్నాయి. ఈ రైలు ఆక్యుపెన్సీ ఏప్రిల్‌లో 131 శాతంగా నమోదైంది, మే మొదటి పది రోజుల్లో ఆక్యుపెన్సీ 134 శాతంగా ఉందని సమాచారం. అలాగే తిరుపతి నుంచి బయలుదేరిన వందే భారత్ రైలు ఏప్రిల్‌లో 136 శాతం, మే నెలలో 137 శాతం ఆక్యుపెన్సీని నమోదు చేసింది. అంతకముందు ఏప్రిల్ 8న సికింద్రాబాద్ నుంచి ఈ వందే భారత్ రైలును ప్రధాని నరేంద్ర మోదీ జెండా ఊపి ప్రారంభించిన సంగతి తెలిసిందే..మరోవైపు ఉదయం 6గంటలకు సికింద్రాబాద్ నుంచి తిరుపతికి బయల్దేరుతున్న వందే భారత్ ఎక్స్‌ప్రెస్(20701) రైలు మే 17 నుంచి ఉదయం 6.15 గంటలకు బయల్దేరేలా అధికారులు మార్పులు చేశారు. అలాగే నల్గొండకు ఉదయం 7.29/7.30 గంటలకు; ఆ తర్వాత గుంటూరుకు 9.35/9.40; ఒంగోలు 11.09/11.10; నెల్లూరు మధ్యాహ్నం 12.29/12.30 గంటలకు వెళ్లి అక్కడి నుంచి మధ్యాహ్నం 2.30 గంటలయ్యే సరికి తిరుపతికి చేరుకునేలా ఏర్పాట్లు చేశారు. అంతేకాక, తిరుపతి నుంచి మధ్యాహ్నం 3.15 గంటలకు బయల్దేరే రైలు(20702) నిర్ణీత స్టేషన్లలో ఆగుతూ అదే రోజు రాత్రి 11.30గంటలకు సికింద్రాబాద్ చేరుకోనుంది. స్థానాలను చేరనుంది.

## బీ. పీ మండల్ విగ్రహ ఆవిష్కరణను విజయవంతం చేయాలి

**కమాన్ పూర్**

మంథని నియోజకవర్గం కేంద్రంలో మంగళ వారం బిందెశ్వర ప్రసాద్ మండల్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి మండలంలోని బీసి సామాజిక వర్గాలకు సంబంధించిన నాయకులు, ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని బీ. ఆర్. ఎస్. బీసి మండల శాఖ అధ్యక్షులు నడిగొట్టు సంపత్ కోరారు. మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్ లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఓ. బీ. సీ రిజర్వేషన్ ల కోసం పోరాడిన మహనీయుడు బీ. పీ మండల్ అన్నారు. బీసిల కోసం ఆయన చేసిన కృషి ప్రశంసనీయమన్నారు. బీసి వర్గాల కు చేసిన కృషికి కృతజ్ఞత పూర్వకంగా తెలంగాణ రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా తొలిసారిగా మంథనిలో మొట్టమొదటి సారిగా పెద్దపల్లి జడ్పి చైర్మన్ పుట్ట మధు నెత్రుత్వంలో బిపి మండల్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం చేయట్టడం చారిత్రత్మాక నిర్ణయమన్నారు. మన బీసి సామాజిక వర్గానికి న్యాయమైన హక్కుల సాధన కోసం ఆహార్నిశలు కృషి చేసిన బీసి నేత బిందెశ్వర్ ప్రసాద్ మండల్ అని కొనియాడారు. అలాంటి మహనీయుడి విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి అధిక సంఖ్యలో బీసీలు తరలిరావాలని కోరారు. జనాభాలో 80 శాతాం ఉన్న బీసీ లు సంఘటితం కావాల్సిన అవసరం, ఆవశ్యకత ఉందాన్నారు. మన కోసం.. మన హక్కుల కోసం ఉద్యమించిన బిందెశ్వర ప్రసాద్ మండల్ విగ్రహ ఆవిష్కరణ కు హాజరై ఘన నివాళులు అర్పించడం మన భాధ్యతగా బావించి స్వాచ్చందంగా తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ విలేకరుల సమావేశం లో మాజీ జడ్పి టి సీ మేకల సంపత్ యాదవ్, సీనియర్ నాయకులు గడప కృష్ణమూర్తి, ఇటవేన కొమురయ్య, పెండ్లి నారాయణ, బంగారు గట్టయ్య, బత్తిని శ్రీనివాస్, పొట్ల శంకర్, చిందం తిరుపతి, రాచకొండ రవి లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి క్రీడాకారుడు క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలి

**మంథని**

ప్రతి క్రీడాకారుడు క్రీడాస్ఫూర్తితోనే ముందుకు సాగాలని పెద్దపల్లి జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధూకర్ పిలుపునిచ్చారు. మంథనిలోని సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల ఆవరణలో జిల్లా యువజన క్రీడాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ముఖ్యమంత్రి కప్ 2023 క్రీడాపోటీలను పెద్దపల్లి జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధూకర్ , మంథని మున్సిపల్ ఛైర్పర్సన్ పుట్ట శైలజ ప్రారంభించారు. ఈసందర్బంగా పుట్ట మధు మాట్లాడుతూ గ్రామీణ క్రీడలు, క్రీడాకారులను గత ప్రభుత్వాలు విస్మరించాయన్నారు. ఎంతో ప్రతిభ ఉన్న క్రీడాకారులను గుర్తించకపోవడంతో క్రీడల పట్ల ఆసక్తి తగ్గిపోయిందన్నారు. కానీ బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతసీఎం కేసీఆర్ క్రీడాకారులతో పాటు క్రీడలకు ప్రాధాన్యత ఇస్తూ ప్రోత్సహం అందిస్తున్నారని ఆయనగుర్తు చేశారు. క్రీడాకారుల్లోని క్రీడానైపుణ్యాన్ని వెలుగులోకి తీసుకువచ్చేలా ఇలాంటి పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రతిభను గుర్తించి ప్రాధాన్యత ఇవ్వడం బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని ఆయన ఈ సందర్బంగా స్పష్టం చేశారు. క్రీడాపోటీల్లో పాల్గొనే క్రీడాకారులు గెలుపు ఓటమిలను స్పిరిట్‌గానే స్వీకరించాలని ఆయన సూచించారు. గ్రామీణ క్రీడలను ప్రోత్సహించేలా క్రీడాకారులకు ఎల్లప్పుడు అండగా ఉంటామని, వారికి సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. ఈ సందర్బంగా క్రీడాకారులను పరిచయం చేసుకుని పలు పోటీలను ఆయన లాంచనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కొండా శంకర్, జెడ్పిటిసి తగరం సుమలత, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎక్కేటి అనంతరెడ్డి, సింగల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్, ఎంపీడీవో బి. రమేష్, మంథని ఎస్సై వెంకటేశ్వర్ స్థానిక కౌన్సిలర్లతో పాటు పలువురు పాల్గొన్నారు

# రాహుల్ టీమ్ ఇక యాక్టివ్

**బెంగళూరు:**

కర్ణాటక ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు ఆ పార్టీకి మాత్రమే కాదు రాహుల్ గాంధీ నాయకత్వానికి కూడా చాలా ముఖ్యమైంది. ఇంకా చెప్పాలంటే ఒక టర్నింగ్ పాయింట్ అనే చెప్పాలి. ఎన్నో అంచనాల మధ్య 2013 జనవరి 19 వ తేదీన కాంగ్రెస్ పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడి గా జైపూర్ లో జరిగిన చింతన్ శిబిర్ కార్యక్రమంలో నియమితులయ్యారు. అయితే ఆ తరువాత ఆయన ప్రస్థానం అంత సాఫీగా సాగలేదు. ప్రత్యర్థి పార్టీల కంటే స్వపక్షంలోనే ఆయన పోరాటం సాగించారనే అంటారు నాటి పరిణామాలు గమనించిన వారు. కాంగ్రెస్ పార్టీ కీలక నేత, మూడుసార్లు తమిళనాడు సీఎం గా పనిచేసిన కామరాజ్ 1963లో ఒక ప్రపోజల్ ను నాటి ప్రధాని నెహ్రూ ముందు ఉంచారు. దాని ప్రకారం పార్టీలోని సీనియర్ నేతలు ఒక ఏజ్ కు చేరుకున్నాక పదవుల నుండి తప్పుకుని పార్టీ కోసం పనిచేయాలని, యువ నాయకత్వానికి పదవులు అప్పజెప్పి వారికి దిశా నిర్దేశం చెయ్యాలన్నదే ఆ ప్రపోజల్. దీనినే కామరాజ్ ప్లాన్ అంటారు. ఇది రాజకీయాల్లో కొంతకాలం సజావుగా అమలు జరిగినా.. ఇందిరా గాంధీ హయాంలో కాస్త మిస్ యూజ్ అయింది అనేవాళ్లు లేకపోలేదు. తన వ్యతిరేకులను ఆమె ఇదే ప్లాన్ ఉపయోగించి నెమ్మదిగా కీలక పదవులనుండి తప్పించారనే ప్రచారమూ ఉంది. అయితే రాహుల్ గాంధీ కాంగ్రెస్ పార్టీకి ఉపాధ్యక్షుడు అయ్యేసరికి నాటి జఖం ప్రభుత్వం తీవ్ర స్థాయిలో అవినీతి ఆరోపణలు ఎదుర్కుంటోంది. ఓవైపు 2ఉ స్కాం, కామన్ వెల్త్ గేమ్స్ స్కాం, చాపర్ స్కామ్, కాష్ ఫర్ వోట్ స్కాం, ఆదర్శ్ కుంభకోణం, ఎఖఒ ఫిక్సింగ్ స్కాం లాంటి కుంభకోణాల ఆరోపణలు జఖం ప్రభుత్వ ప్రతిష్టను బాగా దెబ్బ తీశాయి. ఇలాంటి స్థితిలో 2014 నాటికి పార్టీని బలోపేతం చెయ్యాలంటే పార్టీని ప్రక్షాలణ చేయాలని దానికి కామరాజ్ ప్లాన్ సరైన మార్గం అని రాహుల్ గాంధీ ప్రయత్నించారు. దాని ప్రకారం అంతవరకూ సోనియా గాంధీ కోటరీగా ఉన్న కొందరు కీలక నేతలను పదవులనుండి తప్పించి ఆ స్థానంలో యంగ్ టీమ్ కు చోటు కల్పించాలని ఆయన భావించారు. అయితే ఇది పార్టీలోని కొందరు సీనియర్ లకు కోపానికి కారణం అయిందన్న వాదన ఉంది. 2014 ఎన్నికల్లో ఓటమి తరువాత ఏర్పడిన పరిస్థితుల్లో కొందరు సీనియర్ నేతల్లో తమకు పార్టీ లో ప్రాధాన్యత తగ్గింది అనే అభిప్రాయం కలిగింది అంటారు నాటి పార్టీ వ్యవహారాలు కవర్ చేసిన జర్నలిస్ట్ లు. వారిలో పార్టీ కోశాధికారిగా పనిచేసిన మోతీ లాల్ ఓరా, సోనియా గాంధీ సలహాదారుగా పనిచేసిన అహ్మద్ పటేల్, గులాం నబీ ఆజాద్ లాంటి వారితో పాటు తెలుగు రాజకీయాలకు చెందిన కొందరు సీనియర్ నేతలూ అదే అభిప్రాయంతో ఉన్నారని ప్రచారం జరిగింది. వారి స్థానంలో జ్యోతిరాదిత్య సింధియా, సచిన్ పైలట్, మనీష్ తివారి లాంటి వారు పార్టీలో యాక్టివ్ అయ్యారు . ఇక తన సొంత టీమ్ తో 2019 ఎన్నికలకు వెళ్లాలని భావించిన రాహుల్ గాంధీ ప్రయత్నాలు పూర్తి స్థాయిలో కొనసాగలేదు. పార్టీలోని కొందరు సీనియర్ ల నుండి సహకారం ఆయనకు లభించలేదు అంటారు విశ్లేషకులు. మరోవైపు మోదీ హవా బలంగా కొనసాగడం తో కాంగ్రెస్ పార్టీ ఆ ఎన్నికల్లో మరోసారి ఎదురుదెబ్బ తిన్నది. దానితో రాహుల్ గాంధీ పార్టీ జాతీయ అధ్యక్ష పదవి నుండి తప్పుకున్నారు. తరువాతి పరిణామాల్లో గులాం నబీ ఆజాద్ తో పాటు రాహుల్ సన్నిహితుడుగా పేరుబడ్డ జ్యోతిరాదిత్య సింధియా పార్టీ నుంచి తప్పుకున్నారు. నిజానికి ఆ ఎన్నికల్లో 2014 తో పోలిస్తే కాంగ్రెస్ పార్టీ సీట్ల పరంగానూ.. ఓట్ షేర్ పరంగానూ కాస్త మెరుగైన ఫలితాలే సాధించింది .రాహుల్ గాంధీ పై ప్రత్యర్థి పార్టీలు విపరీతంగా ప్రచారం చేసిన పప్పు ముద్ర రాజకీయాల్లో బలంగా ఉన్న సమయంలో ఆయన భారత్ జోడో యాత్ర ప్రారంభించారు. ఆ యాత్ర మొదట్లో అందరూ లైట్ తీసుకున్నా తరువాత తరువాత రాహుల్ గాంధీకి మద్దతు పెరుగుతూ వచ్చింది. నెమ్మదిగా ఆయనపై ఉన్న పప్పు ముద్ర కనుమరుగవడం మొదలైంది. ఆ సమయంలో జరిగిన హిమాచల్ ప్రదేశ్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. అయితే అది 68 సీట్లు కలిగిన చిన్న రాష్ట్రం కావడంతో పెద్దగా క్రెడిట్ రాహుల్ కు రాలేదు.ఇక తాజా గా జరిగిన కర్ణాటక ఎన్నికల్లో విజయం మాత్రం పూర్తిగా రాహుల్ ముద్ర తోనే సాధ్యం అని కాంగ్రెస్ అంటుంది. దక్షిణాది లో పాగా వెయ్యాలంటే కర్ణాటక ముఖద్వారం అని భావిస్తున్న బీజేపీ ఈ ఎన్నికల్లో గెలుపుకు సర్వశక్తులూ ఒడ్డింది. అయినప్పటికీ కాంగ్రెస్ తిరుగులేని విజయం అందుకోవడంతో ఆ పార్టీలో నూతన ఉత్సాహం కలిగింది. దానితో రాహుల్ గాంధీ ని చూసే దృక్కోణం భారత రాజకీయాల్లో మారడం తథ్యం అంటున్నారు పరిశీలకులు.మారిన పరిస్థితుల దృష్ట్యా తాను అనుకున్నట్టు గా యంగ్ టీమ్ ను డెవలప్ చేసే పనిలో పడ్డారు రాహుల్ గాంధీ. దానితో త్వరలోనే ఆయన టీమ్ కు చెందిన సభ్యులు పార్టీలో కీలకం కావడంతో పాటు తటస్థంగా ఉన్నవారినీ, పార్టీని వదిలి వెళ్లిన వారినీ తిరిగి పార్టీ వైపు ఆహ్వానించే ప్రయత్నాలు ముమ్మరం కావొచ్చు అంటున్నారు. ఏదేమైనా రాహుల్ గాంధీ టీమ్ కు మాత్రం కర్ణాటక విజయంతో కాంగ్రెస్ పార్టీ లో కీలక పాత్ర పోషించేందుకు లైన్ క్లియర్ అయినట్టే అని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

# డబ్బు కోసం అమ్మాయిలతో నగ్న పూజలు

## దిశ యాప్ తో రంగంలోకి పోలీసులు

**హైదరాబాద్ :**

గుంటూరు జిల్లాలో రెండ్రోజుల క్రితం వెలుగు చూసిన నగ్న పూజల వ్యవహారంలో 12మంది నిందితుల్ని పోలీసులు అరెస్ట్ చేశారు. నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో యువతులకు డబ్బు ఆశ చూపించి మోసగించేందుకు ప్రయత్నించిన మోసగాడి ఆగడాలకు దిశ యాప్ సాయంతో అడ్డుకట్ట పడింది. బాధిత యువతులు మొబైల్ ఫోన్‌లోని దిశ యాప్ ఎస్‌వోఎస్ బటన్ నొక్కడంతో నిమిషాల వ్యవధిలోనే పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని యువతులను రక్షించారు.బాధిత యువతులు ఇచ్చిన సమాచారం ఆధారంగా అఘాయిత్యాలకు పాల్పడిన 12 మందిని నల్లపాడు పోలీసులు అరెస్ట్ చేశారు. డీఎస్పీ మహబూబ్‌బాషా కథనం ప్రకారం, తాడికొండ మండలం పొన్నెకల్లుకు చెందిన పూజారి నాగేశ్వరరావు, బోర్లు వేసే సమయంలో కొబ్బరి కాయలతో నీరు పడుతుందో లేదో చెప్పే పనులు చేస్తుంటాడు. ఈ క్రమంలోనే గుప్త నిధులను వెదకడం ప్రారంభించాడు. ఈ క్రమంలో తనకు పరిచయమైన వి.నాగేంద్రబాబుకు నగ్నంగా పూజలు చేస్తే ఆర్థికంగా కలిసి వస్తుందని ఆశ చూపించాడు. నాగేశ్వరరావు మాటలు నమ్మిన నాగేంద్రబాబు తన క్లాస్‌మేట్ అయిన కర్నూలు జిల్లా ఆత్మకూరు, నంద్యాల ప్రాంతాలకు చెందిన సురేష్, ఖాశిం, పెద్దిరెడ్డిలను నగ్నంగా పూజలో కూర్చునే మహిళలు ఉంటే వారికి లక్ష రూపాయలు ఇస్తారని చెప్పాడు. దీంతో సురేష్, ఖాశిం, పెద్దరెడ్డి ఇద్దరు యువతులతో మే8వ తేదీన గుంటూరు వచ్చి నాగేంద్ర బాబును కలిశారు. ఈ విషయాన్ని నాగేంద్రబాబు పూజారి నాగేశ్వరరావుకు చెప్పాడు. దీంతో నాగేశ్వరరావు అనుచరులు, అతడి కారు డ్రైవర్ సునీల్, చిలకలూరి పేటలో మహిళల్ని ప్రలోభ పెట్టి వ్యభిచారంలోకి దించే అరవింద, సుబ్బు, శివ, రాధ గుంటూరు బస్టాండ్‌కు వెళ్లి నంద్యాల నుంచి వచ్చిన సురేష్, ఖాశిం, పెద్దరెడ్డిలను కలిశారు. డబ్బుల గురించి మాట్లాడు కుని ఒప్పందానికి వచ్చారు. మంగళవారం రాత్రి పూజలు ప్రారంభించాలని నాగేశ్వరరావు చెప్పగా.. వారంతా తాడికొండ మండలం పొన్నెకల్లులోని నాగేశ్వరరావు ఇంటికి చేరుకున్నారు. ఆ తరువాత నాగేశ్వరరావు యువతులను ఓ గదిలో నగ్నంగా కూర్చోబెట్టి పూజలు ప్రారంభించాడు. మధ్యలో యువతుల పట్ల అసభ్యంగా ప్రవర్తించగా వారు అడ్డుకునే ప్రయత్నం చేశారు. పూజ చేస్తున్న సమయంలో కదిలితే ప్రాణాలు పోతాయని బెదిరించడంతో యువతులు ఏమీ చేయలేకపోయారు. పూజలు ముగిసిన అనంతరం నాగేశ్వరరావు, అతని అనుచరులు యువతులపై అత్యాచారానికి పాల్పడ్డారు. పొన్నెకల్లులో పూజలు కుదరటం లేదని చిలకలూరి పేటలోని పండరీపురంలో అరవింద ఇంట్లో పూజలు చేయాలని నిర్ణయించారు. బుధవారం రాత్రి అంతా చిలకలూరిపేట వెళ్లారు. శుక్రవారం వరకూ పూజలు చేసే క్రమంలో యువతులపై మళ్లీ లైంగిక దాడికి పాల్పడ్డారు. నాలుగు రోజులుగా పూజలు చేస్తున్నా ఫలితం లేకపోవటంతో నాగేశ్వరరావు అక్కడినుంచి పారిపోయాడుఈ క్రమంలో సదరు యువతులు ఒప్పందం ప్రకారం తమకు డబ్బు ఇస్తే ఇంటికి వెళ్లి పోతామని నాగేశ్వరరావు అనుచరులను అడిగారు. దీంతో నాగేశ్వరరావు అనుచరులకు, యువతులకు వివాదం తలెత్తింది. ఈ విషయాన్ని అరవింద నాగేశ్వరరావుకు ఫోన్ చేసి చెప్పడంతో తన ఇంటికి వస్తే సెటిల్‌మెంట్ చేసుకుందామని నాగేశ్వరరావు సూచించాడు. అందరూ కారులో పొన్నెకల్లు బయలుదేరారు.మధ్యలో నాగేశ్వరరావు అనుచరులు యువతులను బెదిరించడంతో గోరంట్ల సమీపంలో బాధిత యువతులు తమ వద్దనున్న సెల్‌ఫోన్‌లో దిశ యాప్‌లో ఎస్‌వోఎస్ బటన్ నొక్కడంతో వెంటనే స్పందించిన ఎస్పీ ఆరీఫ్ హఫీజ్ నేతృత్వంలో నల్లపాడు పోలీసులు అప్రమత్తమయ్యారు. తక్షణమే నగర శివార్లలోని గోరంట్ల వద్ద ఉన్న యువతులను రక్షించారు. వారితో పాటు అరవింద, నాగేంద్రబాబు, సునిల్‌ను అదుపులోకి తీసుకున్నారు.విచారణలో నిందితులు జరిగిన విషయాన్ని ఒప్పుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు ప్రధాన నిందితుడు నాగేశ్వరరావు, నాగేంద్రబాబు, అరవింద చౌదరి, రాధ, భాస్కర్, పెద్దిరెడ్డి, సాగర్, వెంకటసురేష్, శివ, సునీల్, పవన్, సుబ్బులను అరెస్ట్ చేశారు. ఈ ఘటనలో మరికొందరు ఉన్నారని, త్వరలో వారిని అరెస్ట్ చేస్తామని డీఎస్పీ మహబూబ్‌బాషా చెప్పారు. ఎవరైనా డబ్బు ఆశచూపి యువతులు, మహిళలకు ఎరవేస్తే నమ్మి మోసపోవద్దని డీఎస్పీ కోరారు.

# ఎలక్ట్రానిక్స్ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్‌కు భూమి పూజ

**హైదరాబాద్ :**

తెలంగాణలో అతిపెద్ద ఎలక్ట్రానిక్స్ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్‌కు రంగారెడ్డి జిల్లాలో భూమి పూజ నిర్వహించారు. ప్రపంచ ప్రఖ్యాత ఎలక్ట్రానిక్స్ దిగ్గజ సంస్థ ఫాక్స్‌కాన్‌ను రాష్ట్రంలో నెలకొల్పేందుకు రంగం సిద్ధమైంది. రంగారెడ్డి జిల్లా కొంగరకలాన్ గ్రామంలో పరిశ్రమలశాఖ మంత్రి కేటీఆర్ ఫాక్స్‌కాన్ సంస్థ నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. తెలంగాణలో పరిశ్రమ ఏర్పాటుకు సహకరించినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి ఫాక్స్‌కాన్ గ్రూప్ ఛైర్మన్ సిడ్నీ లూ కృతజ్ఞతలు తెలిపారు.తెలంగాణలో పరిశ్రమను ఏర్పాటుకు ముందుకు వచ్చిన ఫాక్స్‌కాన్ సంస్థకు అన్ని విధాలుగా అండగా ఉంటామని మంత్రి కేటీఆర్ చెప్పారు. 9నెలల్లో ప్లాంటు నిర్మాణాన్ని పూర్తి చేయడానికి తమ వంతు సహకరిస్తామని చెప్పారు. తెలంగాణ చరిత్రలో ఈ రోజు నిలిచిపోతుందని కేటీఆర్ చెప్పారు. ఫాక్స్ కాన్ గ్రూప్ ఎలక్ట్రానిక్ మాన్యూఫ్యాక్చరింగ్ రంగంలో ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందిందన్నారు.భారత్‌తో భాగస్వామ్యంలో భాగంగా తెలంగాణకు వచ్చినందుకు సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రం ఆవిర్భవించిన 9ఏళ్లలో



తలసరి ఆదాయం రెండున్నర రెట్లు పెరిగిందని కేటీఆర్ గుర్తు చేశారు. 2.3 మిలియన్ల ఉద్యోగ అవకాశాలను కల్పించినట్లు చెప్పారు. తలసరి ఆదాయన్ని గణనీయంగా పెంచడంలో ఎలక్ట్రానిక్ మాన్యూఫ్యాక్చరింగ్ రంగానికి కీలక స్థానం పోషిస్తుందన్నారు. 50బిలియన్ల ఆర్థిక వ్యవస్థను ఎలక్ట్రానిక్ మాన్యూ ఫ్యాక్చరింగ్ రంగంలోనే సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. ఎంఓయూ కుదుర్చుకున్న రెండున్నర నెలల్లోనే ఫాక్స్ కాన్ సంస్థ భూమి పూజ నిర్వహిస్తున్నామని, తమ చిత్తశుద్ధికి ఇదే నిదర్శనమని చెప్పారు. ఫాక్స్‌కాన్ ప్లాంటుతో 500మిలియన్ డాలర్ల పెట్టుబడితో 25వేల ఉద్యోగాలు వస్తాయని కేటీఆర్ చెప్పారు.భూమి పూజ జరిగినప్పటి నుంచి ఏడాదిలోగా ఉత్పత్తి ప్రారంభం అవుతుందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం నైపుణ్యం ఉన్న ఉద్యోగులను తయారు చేసేందుకు శిక్షణా సంస్థలను ఏర్పాటు చేస్తుందని హామీ ఇచ్చారు. రూ.1,655 కోట్ల పెట్టుబడితో ఈ సంస్థను ఏర్పాటు చేస్తున్నారు. సంస్థ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం 196 ఎకరాల భూమిని కేటాయించింది.తైవాన్‌కు చెందిన మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల తయారీ సంస్థ ఫాక్స్‌కాన్ (ఈనీలీఇనీనిని) టెక్నాలజీస్‌కు రంగారెడ్డి జిల్లా కొంగరకలాన్‌లో మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేశారు.మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల తయారీలో ప్రపంచంలోనే అత్యంత ప్రఖ్యాతి గాంచిన సంస్థ ఫాక్స్‌కాన్, 70 శాతం యాపిల్ ఐఫోన్లను ఫాక్స్‌కాన్ కంపెనీయే తయారు చేస్తోంది. కొంగరకలాన్‌లో ఫాక్స్‌కాన్ పరిశ్రమ ఏర్పాటుకు ప్రభుత్వం 196 ఎకరాల స్థలాన్ని కేటాయించింది. యాపిల్ సంస్థ నుంచి ఇప్పటికే ఫాక్స్‌కాన్‌కు భారీ ఆర్డర్ రావడంతో వచ్చే ఏడాది చివరికల్లా ఉత్పత్తి ప్రారంభించాలని సంస్థ లక్ష్యంగా పెట్టుకొన్నది. యాపిల్ కంపెనీ ఎయిర్‌పాడ్‌లు, వైర్‌లెస్ ఇయర్‌ఫోన్ల తయారీ ఆర్డర్‌ను కూడా ఫాక్స్‌కాన్‌కు అప్పగించింది.

# 17 నుంచి 3 రోజుల పాటు ఏనుగుల లెక్కింపు

**తిరుపతి :**

దక్షిణాది రాష్ట్రాల్లో ఏనుగుల లెక్క తేల్చేందుకు ఆయా రాష్ట్రాల అటవీ శాఖలు సిద్ధమయ్యాయి. ఈ నెల 17వ తేదీ నుంచి 3 రోజులపాటు ఏనుగుల గణన చేపట్టనున్నారు. మన రాష్ట్రంలోని కౌండిన్య ఏనుగుల అభయారణ్యం, శ్రీ వెంకటేశ్వర నేషనల్ పార్క్, శేషాచలం అటవీ ప్రాంతాల్లో లెక్కింపు చేపట్టనున్నారు. చిత్తూరు జిల్లా పలమనేరు అటవీ ప్రాంతంలో ఏనుగుల సంచారం ఎక్కువగా ఉంది. తమిళనాడు సరిహద్దుల నుంచి ఈ ప్రాంతంలోకి ఏనుగులు వస్తుండటంతో వాటి కోసం చాలాకాలం క్రితం కౌండిన్య అభయారణ్యాన్ని నెలకొల్పారు. శేషాచలం అడవులు, ఎస్వీ నేషనల్ పార్క్‌లోనూ ఏనుగులు ఉన్నాయి. ప్రస్తుతం ఈ ప్రాంతాల్లో సుమారు 175 ఏనుగులు ఉన్నట్టు అంచనా వేశారు. తాజా లెక్కింపు పూర్తయితే వాటి సంఖ్య పెరిగిందా.. తగ్గిందా అనేది తేలుతుంది. ఏనుగులు నీటి లభ్యతను బట్టి ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి సంచరిస్తూ ఉంటాయి. ఈ క్రమంలోనే అవి ఒక రాష్ట్రం నుంచి మరొక రాష్ట్రంలోకి ప్రవేశించి అటూఇటూ తిరుగుతూ ఉంటాయి. దీంతో రాష్ట్రాల వారీగా లెక్కింపు చేపట్టినప్పుడు రెండుచోట్లా వాటిని లెక్కించడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలోనే అటవీ సరిహద్దులు ఉన్న రాష్ట్రాల్లో ఒకేసారి లెక్కింపు జరపాలని నిర్ణయించారు. అందులో భాగంగానే దక్షిణ భారతదేశంలోని కర్ణాటక, కేరళ, ఏపీ, తమిళనాడు, గోవా, మహారాష్ట్రలోని కొంత ప్రాంతంలో ఒకేసారి ఈ నెల 17, 18, 19 తేదీల్లో లెక్కింపు జరపనున్నారు. ఇందుకోసం కర్ణాటక అటవీ శాఖ రూపొందించిన మోడల్‌ను అనుసరిస్తున్నారు. అక్కడ ఏనుగుల సంఖ్య వేలల్లో ఉండటంతో చాలా జాగ్రత్తగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. అదే విధానంలో మన రాష్ట్రంలో లెక్కింపు నిర్వహించడానికి అటవీ శాఖ సిద్ధమైంది. మొదటి రోజు 17వ తేదీన అటవీ ప్రాంతంలోని బ్లాకుల పరిధిలో బీట్ల వారీగా 5 చదరపు కిలోమీటర్ల పరిధిలో 15 కిలోమీటర్లు తిరిగి లెక్కింపు జరపనున్నారు. ఇందుకోసం బీట్ల వారీగా ఇద్దరు, ముగ్గురితో బృందాలు ఏర్పాటు చేశారు. రెండవ రోజు నిర్దేశించిన రెండు కిలోమీటర్ల ప్రాంతంలో తిరిగి ఏనుగుల గుంపులను బట్టి లెక్కింపు జరుపుతారు. మూడవరోజు చెరువులు, మైదానాల్లో నేరుగా ఏనుగుల గుంపుల వద్దకెళ్లి వాటి ఫొటోలు తీసి లెక్కిస్తారు. గుంపులో పెద్దవైన ఆడ, మగ ఏనుగులు.. ఆ తర్వాత పెద్దవైన మగ, ఆడ ఏనుగులు.. పిల్లలు, దంతాలు లేని ఏనుగులు (మఖనా), గుంపు నుంచి వేరుపడిన ఒంటరి ఏనుగులుగా వాటిని వర్గీకరించి లెక్కింపు చేపట్టనున్నారు. దక్షిణాది రాష్ట్రాలతో కలిసి ఒకేసారి ఏనుగుల లెక్కింపును ప్రణాళికాబద్ధంగా చేపడుతున్నాం. ఇందుకోసం పక్కా ప్రణాళిక సిద్ధం చేశాం. మూడు విధాలుగా లెక్కింపు నిర్వహించడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. ఏపీ సీసీఎఫ్ (వైల్డ్ లైఫ్) శాంతిప్రియ పాండే, అంటున్నారు.

# ఇంటికే బీపీ, షుగర్ మందులు

**హైదరాబాద్ :**

తెలంగాణ ప్రభుత్వం ప్రజలకు ఇబ్బంది లేకుండా కొన్ని కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. నాన్ కమ్యూనికేబుల్ డిసీజెస్ కిట్ల పంపిణీ చేయాలని నిర్ణయించుకుంది. అందులో భాగంగా దీర్ఘ కాలిక వ్యాధులైన బీపీ, షుగర్ వ్యాధి గ్రస్తులకు ఇంటి వద్దకే మందులు అందించనున్నారు. శుక్రవారం నుంచే హైదరాబాద్ జిల్లాలో ఈ విధానం అమల్లోకి వచ్చింది. రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆశా వర్కర్లు ఎన్‌సీడీ కిట్స్‌ను పంపిణీ చేయటం ప్రారంభించారు. ఈ విధానం ద్వారా దీర్ఘ కాలిక వ్యాధులతో బాధ పడుతున్న వారికి ప్రభుత్వం నుంచి ఉపశమనం లభిస్తోంది. షుగరు..బీపీ వంటి దీర్ఘకాలిక సమస్యలతో బాధ పడుతున్న వారికి ఈ కిట్లు పంపిణీ కొనసాగుతోంది. ప్రతి కుటుంబంలో వయసు మీద పడిన వారికి దీర్ఘకాలిక సమస్యలైన బిపి, షుగర్ వంటి వ్యాధులు సర్వసాధారణంగా మారిపోయాయి. వీరంతా ప్రతినెలా మెడికల్ షాపులకి వేల రూపాయలు ఖర్చు చేస్తున్నారు. ఈ పరిస్థితుల నుంచి పేద ప్రజలను కాపాడేందుకు ప్రభుత్వం మెడికల్ కిట్లను అందజేస్తుంది. ఈ కిట్లలో బిపి, షుగర్ టాబ్లెట్లను ఉంచి వారికి కావలసిన టాబ్లెట్లను ఆశా వర్కర్ల ద్వారా ఇంటింటికీ తిరిగి అందజేస్తుంది. నాన్ కమ్యూని కేబుల్ డిసీజెస్ అంటే అసంక్రమిత వ్యాధి నివారణ అదుపునకు గాను ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ముఖ్యంగా అధిక రక్తపోటు మధుమేహాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ కిట్లను రూపొందించారు. బిపి, షుగర్ నియంత్రణతో లేకపోతే గుండెపోటు, పక్షవాతం, కంటి చూపు మందగించడం, దీర్ఘకాలిక కిడ్నీ వ్యాధులకు గురవడం, రక్తనాళాలు దెబ్బ తినడం, పాదాలకు పుండ్లు వంటి దుష్ప్రమైన పరిణామాలు బారిన పడే అవకాశం ఉంది. మందులను క్రమం తప్పకుండా వాడాలని సూచిస్తూ ప్రభుత్వం ఈ కిట్లను తయారు చేసింది. ఈ మందులను సులభంగా తీసుకెళ్లేందుకు వీలుగా, మందులను ఉంచుకునేందుకు వీలుగా.. చేతి సైజు బ్యాగులను రూపొందించారు. ఈ బ్యాగుల్లో బిపి, షుగర్ మందులను పెట్టుకోవడానికి వీలుగా కల్పిస్తుంది. ఈ బ్యాగులోనే బీపీ, షుగర్ మందులను పెట్టుకొని వాడుకోవలసి ఉంటుంది. ఒక్కో వ్యాధి గ్రస్తుడికి నెలకు సరిపడా మందులతో ఈ కిట్లను అందిస్తున్నారు. వీటితో పాటుగా త్వరలోనే న్యూట్రీషన్ కిట్లను సైతం అందజేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. గర్భిణుల డేటా సేకరణ, కిట్స్ పంపిణీ తదితర అంశాలపై ప్రత్యేక కార్యాచరణ రూపొందించడంలో నిమగ్నమయ్యారు.

# 21 రోజుల అవతరణోత్సవాలు

**హైదరాబాద్ :**

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటు జరిగి 10 ఏళ్లు అవుతున్న సందర్భంగా, ఈసారి ఉత్సవాలు వైభవంగా ప్రభుత్వం నిర్వహించనుంది. అందుకోసం అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను సీఎం కేసీఆర్ ఆదేశించారు. తెలంగాణ కీర్తి చాటేలా, ప్రతి హృదయం ఉప్పొంగేలా పండుగ తరహాలో 21 రోజుల పాటు ఉత్సవాలు చేయాలని స్పష్టం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా జూన్ 2 నుంచి 21 రోజులపాటు ఈ సంబురాలు జరుగుతాయని చెప్పారు. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల గురించి సచివాలయంలో సీఎం కేసీఆర్ ఉన్నత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో నిర్ణయించిన ప్రకారం.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలంగాణ సచివాలయంలో మొదటిరోజు ఉత్సవాలను నిర్వహిం చనున్నారు. అదే రోజు మంత్రులు వారి జిల్లా కేంద్రాల్లో ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో పాల్గొంటారు. "తెలంగాణ రాష్ట్రాన్ని తెచ్చుకుని 2023 జూన్ 2 నాటికి 9 సంవత్సరాలు పూర్తి కానున్నాయి. 10వ సంవత్సరంలోకి అడుగు పెడుతున్నాం. ఈ వ్యవధిలో రాష్ట్రంలోని ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ యంత్రాంగం సహకారంతో సమష్టి కృషితో తెలంగాణ అన్ని రంగాల్లో అత్యద్భుతంగా ఫలితాలను సాధిస్తుంది. తెలంగాణ దేశానికే ఒక రోల్ మోడల్‌గా అయింది. మహారాష్ట్రతోపాటు ఉత్తరాది రాష్ట్రాల నాయకులు, ప్రజలు తెలంగాణ సాధిస్తున్న అభివృద్ధి చూసి ఆశ్చర్యపోతున్నారు. తెలంగాణ అమరులను స్మరించుకునేందుకు ఒక రోజును ప్రత్యేకంగా.. అమరుల దినోత్సవాన్ని జరుపుకోవాలి. ఆ రోజు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అమరుల స్తూపాలను పుష్పాలు, విద్యుత్తు దీపాలతో అలంకరించి నివాళులర్పించాలి. అమరుల త్యాగాలను స్మరిస్తూ తుపాకీ పేల్చి పోలీసులు అధికారికంగా గౌరవ వందనం చేయాలి" అని సీఎం కేసీఆర్ సూచించారు. మిగతా 20 రోజులలో రాష్ట్రంలోని వివిధ శాఖలు చూపిన ప్రగతిపై, ప్రభుత్వం పడిన కష్టాన్ని, దార్శనికతను, దృక్పథాన్ని విశ్లేషిస్తూ డాక్యుమెంట్ ను రూపొందించాలి. దీన్ని థియేటర్లు, టీవీలలో ప్రసారం చేయించాలి. తెలంగాణ తొలిదశ ఉద్యమం నుంచి రాష్ట్రాన్ని సాధించిన దాకా సాగిన ఉద్యమ చరిత్రను తెలియజేసేలా మరో డాక్యుమెంటరీని రూపొందించాలి. ఆటపాటలు, కవి సమ్మేళనాలు, అష్టావ ధానాలు, సంగీత విభావరి, సినిమా, జానపద తదితర కళాకారులతో సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేయాలి. చారిత్రక నిర్మాణాలను, ఎల్‌ఈడీ లైట్లతో అలంకరించాలి. ప్రతిభ కనబరిచిన అన్నిశాఖల ప్రభుత్వ ఉద్యోగులను గుర్తించి అవార్డులు అందించాలి. సీఎస్ శాంతి కుమారి ఆధ్వర్యంలోని ఉత్సవాల కమిటీ, వేడుకల నిర్వహణపై ఉన్నత అధికారులతో చర్చించుకోవాలి"అని సీఎం కేసీఆర్ సూచించారు.

# కరాటే కళ్యాణి వర్సెస్ బీఆర్ఎస్

**ఖమ్మం:**

ఖమ్మంలో ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటుపై వివాదం నెలకొంది. శ్రీ కృష్ణుడు రూపంలో విగ్రహం ఏర్పాటుచేస్తే అడ్డుకుంటామని హిందూ, యాదవ సంఘాలు, కరాటే కల్యాణి అంటున్నారు. అయితే కరాటే కల్యాణి ఫెయిట్ ఆర్టిస్ట్‌లతో రాద్ధాంతం చేస్తున్నారని బీఆర్ఎస్ యాదవ సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఖమ్మంలో మంత్రి పువ్వాడ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయబోయే ఎన్టీఆర్ విగ్రహంపై వివాదం నెలకొంది. శ్రీకృష్ణుడి రూపంలో ఎన్టీఆర్ విగ్రహం రూపొందడంపై క్యారెక్టర్ ఆర్టిస్ట్ కరాటే కల్యాణి, యాదవ సంఘాలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటుకు తాము వ్యతిరేకం కాదని, అయితే కృష్ణుడి రూపంలో పెట్టడం సరికాదంటున్నారు. రాజకీయ ప్రయోజనం మేరకు విగ్రహం ఏర్పాటుచేస్తున్నారని, యాదవ, కమ్మ సామాజిక వర్గాల ఓట్లు కోసమే ఈ ఎన్టీఆర్ రూపంలో ఏర్పాటు చేస్తున్నారని కరాటే కల్యాణి ఆరోపిస్తున్నారు. ఈ విగ్రహాన్ని జూనియర్ ఎన్టీఆర్ ప్రారంభిస్తే ఊరుకోమని హెచ్చరిస్తున్నారు. విగ్రహ ఆవిష్కరణను అడ్డుకుంటామని అంటున్నారు. ఈ నెల 28న ఎన్టీఆర్ శత జయంతిని ఘనంగా నిర్వహించాలని ఫాన్స్ అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఖమ్మంలోని లకారం చెరువులో 54 అడుగుల ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు మంత్రి పువ్వాడ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ కార్యక్రమానికి తానా సభ్యులు, ఎన్నారైలు, పారిశ్రామిక వేత్తలు తమ వంతుగా సాయం అందిస్తున్నారు. సుమారు నాలుగు కోట్ల రూపాయల వ్యయంతో ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటుచేస్తున్నారు. ఈ విగ్రహ ఆవిష్కరణకు ముఖ్య అతిథిగా జూనియర్ ఎన్టీఆర్ పాల్గొనున్నారు. ఈ కార్యక్రమానికి ఏర్పాట్లు జరుగుతుంటే, మరోవైపు కొందరు వివాదాలు సృష్టిస్తున్నారు. శ్రీ కృష్ణుడు రూపంలో ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటుపై హిందూ, యాదవ సంఘాలు, కరాటే కల్యాణి అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం ఈ విగ్రహం ఏర్పాటుచేస్తున్నారని సినీనటి కరాటే కల్యాణి ఆధ్వర్యంలో ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయం ముందు హిందూ, యాదవ సంఘాల సభ్యులు ఆందోళన చేశారు. ఎన్టీఆర్‌కి విగ్రహం పెడితే అందరికీ సంతోషమేనన్న ఆమె...కానీ కృష్ణుడు రూపంలో విగ్రహం పెట్టడాన్ని మాత్రం తాము వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. వచ్చే తరాల వారు ఎన్టీఆర్‌ను శ్రీకృష్ణుడు అనుకునే పరిస్థితి వస్తుందన్నారు. కృష్ణుడి రూపంలో ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటును మంత్రి పువ్వాడ ఆపాలని, లేకపోతే తామే అడ్డుకుంటామని కరాటే కల్యాణి, యాదవ సంఘాలు హెచ్చరించాయి. ఖమ్మంలో ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటులో ఎవరి మనోభావాలు దెబ్బతినలేదని కరాటే కల్యాణి యాదవ సంఘం ముసుగులో కుల, మతాల మధ్య చిచ్చు పెడుతున్నారని బీఆర్ఎస్ యాదవ ప్రతినిధులు అంటున్నారు. హైదరాబాద్ నుంచి పెయిడ్ ఆర్టిస్టులను తీసుకు వచ్చి ఖమ్మంలో కుల, మతాల మధ్య చిచ్చు పెట్టేందుకు ఆమె ప్రయత్నిస్తున్నారని బీఆర్ఎస్ నేతలు తెలిపారు. ఖమ్మంలో ఉన్న యాదవులను ఆమె సంప్రదించలేదన్నారు. ఆమె వెనుక ఎవరో ఉండి రాజకీయ కుట్ర చేస్తున్నారో చెప్పాలని ప్రశ్నించారు. సూట్ కేసుల్లో డబ్బులు తీసుకొని, అనవసర రాద్ధాంతం చేస్తున్నారని ఆరోపించారు.

# తిరుమలలో ముగిసిన బాలకాండ పారాయణం

**తిరుమల:**

ప్రపంచంలోని ప్రజలంతా ఆయురారోగ్యాలతో ఉండాలని శ్రీవారిని ప్రార్థిస్తూ తిరుమల నాదనీరాజనం వేదికపై 2021 జులై 25న ప్రారంభించిన బాలకాండ పారాయణం సోమవారం ఘనంగా ముగిసింది. తిరుమల ధర్మగిరి వేద విజ్ఞానపీఠం ప్రిన్సిపాల్ కుప్పా శివసుబ్రమణ్య అవధాని మాట్లాడుతూ, లోక కల్యాణార్థం టీటీడీ నిర్వహిస్తున్న పారాయణ యజ్ఞంలో భాగంగా, మంత్ర పారాయణం ప్రారంభించిందన్నారు. ఇందులోని ప్రతి శ్లోకం మంత్రమేనన్నారు. బాలకాండలోని మొత్తం 77 సర్గల్లో 2,232 శ్లోకాలను 649 రోజులపాటు పారాయణం చేశామన్నారు. ప్రతి శ్లోకానికి అర్థంతోపాటు ప్రస్తుత సమాజానికి అన్వయించి పండితులు వ్యాఖ్యానం అందించారని వివరించారు. శ్రీ బేడి ఆంజనేయస్వామి, శ్రీరాముని అవతారమైన శ్రీ వేంకటేశ్వరస్వామివారి సమక్షంలో నాదనీరాజనం వేదికపై బాలకాండ పారాయణం చేయడం గొప్ప విషయమన్నారు. రామనామస్మరణ ఎక్కడ జరిగితే అక్కడ హనుమంతుడు ఉంటారని వాల్మీకి మహర్షి తెలియజేశారని, ఆవిధంగా ఇన్నిరోజులు ఆంజనేయుడు మనమధ్యే ఉన్నారని చెప్పారు. వాల్మీకి మహర్షి గురువుగా మారి రామాయణాన్ని లోకానికి అందించారన్నారు.

బాలకాండ పారాయణం నిర్వహించిన ఎస్వీ వేద విశ్వవిద్యాలయం అధ్యాపకులు డా. ప్రవ రామకృష్ణ సోమయాజులు, ధర్మగిరి వేదవిజ్ఞానపీఠం పండితులు రామానుజచార్యులు, మారుతి, శ్రీశేషాచార్యులకు, ఈ కార్యక్రమాన్ని కోట్లాది మంది భక్తులకు చేరువ చేసిన ఎస్వీబీసీ సిఈఓ షణ్ముఖ కుమార్ కు, అద్భుతమైన కీర్తనలు ఆలపించిన అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులకు ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం పండితులను, కళాకారులను సన్మానించారు బాలకాండలోని 74 నుండి 77వ సర్గ వరకు 4 సర్గలు, యోగ వాశిష్ఠం, ధన్వంతరి మహామంత్రం, అష్టాక్షర శ్రీరామమంత్ర స్తోత్రం కలిపి మొత్తం 166 శ్లోకాలను శ్రీ అవధాని పర్యవేక్షణలో పండితులు పారాయణం చేశారు. ఎస్వీబీసీ ప్రత్యక్ష ప్రసారం ద్వారా భక్తులు తమ ఇళ్ల నుంచే పారాయణంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్వీ సంగీత నృత్య కళాశాల అధ్యాపకులు శ్రీమతి వందన బృందం "శ్రీరామ జయరామ శృంగార రామాయని", కార్యక్రమ ప్రారంభంలో, హైదరాబాద్ కు చెందిన సాంప్రదాయ కళాశాల విద్యార్థుల బృందం "ప్రతి వారం వారం మానస భజారే రఘువీరం సంకీర్తనను చివరిలో ఆలపించారు.

# ముగిసిన ఆక్వా సాధికారిత కమిటీ భేటీ


**విజయవాడ**

విజయవాడలో 6వ ఆక్వా సాధికారిత కమిటీ సమావేశం జరిగింది. మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, బొత్స సత్యనారాయణ, సీదిరి అప్పలరాజు, అప్సడా చైర్మన్ వడ్డి రఘురాం తదితరులు పాల్గొన్ఆనరు. భేటీలో ఆక్వా ఉత్పత్తుల ధరలు, ఫిష్ ఆంధ్రా యూనిట్లపై సమీక్ష జరిగింది. రాష్ట్ర వ్యాప్తంగా 46,445 మంది రైతులకు ఆక్వా విద్యుత్ సబ్సిడీ, ఈ ఫిష్ సర్వేతో చిన్న రైతులకు పెద్ద మేలు జరగనుంది. 3.27 లక్షల ఎకరాల్లో ఆక్వా సాగుకు ఏటా రూ.672 కోట్ల సబ్సిడీ, ఆక్వాఫీడ్, సీడ్ రేట్లు, ఆక్వా ఉత్పత్తుల ధరలు స్థిరీకరణ, రాష్ట్ర వ్యాప్తంగా 4 వేల ఫిష్ ఆంధ్రా యూనిట్ల ఏర్పాటుకు సన్నాహాలు, ఇప్పటికే 1549 యూనిట్ల ఏర్పాటుపై చర్చ జరిగింది. మంత్రులు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా శాస్త్రీయంగా నిర్వహించిన ఈ ఫిష్ సర్వే వల్ల లక్షలాధి మంది అర్హులైన చిన్న ఆక్వారైతులకు ప్రభుత్వ సబ్సిడీ చేరువ అయ్యిందని అన్నారు. ఆక్వా జోన్ పరిధిలో పది ఎకరాలలోపు సాగు చేస్తున్న ప్రతి ఆక్వా రైతుకు ప్రభుత్వం నుంచి విద్యుత్ సబ్సిడీ అందిస్తున్నామని తెలిపారు. దీనిలో భాగంగా ఈ ఫిష్ సర్వే ద్వారా అర్హులైన ఆక్వా రైతులను గుర్తించడం జరిగిందని అన్నారు. సర్వే తరువాత రాష్ట్రంలో 46,445 మంది రైతులను అర్హులుగా నిర్ధారించడం జరిగిందని, దాదాపు 3,27,575 ఎకరాలకు, విద్యుత్ సబ్సిడీగా ఏటా రూ.672.61 కోట్లు అందిస్తున్నామని తెలిపారు. ఈ ఫిష్ సర్వేకు ముందు ఆక్వాజోన్ పరిధిలో పది ఎకరాల లోపు ఆక్వా సాగు చేస్తున్న విస్తీర్ణం కేవలం 1.90 లక్షల ఎకరాలకు మాత్రమే సబ్సిడీ అందితే, సర్వే తరువాత 3.27 లక్షల ఎకరాలకు సబ్సిడీ లబ్ధి చేకూరుతోందని తెలిపారు. ఎక్కువ మంది అర్హులైన చిన్న రైతులు ఆక్వాజోన్ పరిధిలో ఈ పరిమితుల్లోకి రావడం వల్ల వారికి మేలు జరుగుతోందని తెలిపారు.

# ప్రజావాణికి వచ్చే సమస్యలను అధిక ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరించాలి

**జగిత్యాల**

ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే సమస్యలకు అధిక ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అదనపు కలెక్టర్ బి.ఎస్. లత తో కలిసి ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజలు ఎన్నో వ్యయప్రయాలకు ఓర్చి వస్తారని, అధికారులు వారి శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని



అన్నారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కాగా ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 54 ఫిర్యాదులు, వినతులు వచ్చాయిని అధికారులు తెలిపారు.. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ పర్యవేక్షకులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎంఎల్సీల ప్రమాణ స్వీకారం

**అమరావతి**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసన మండలికి రాష్ట్రంలోని వివిధ స్థానిక సంస్థల నుండి ఎన్నికైన 8 మంది నూతన శాసన మండలి సభ్యులు ఎంఎల్సిలుగా ప్రమాణం చేశారు. ఈమేరకు సోమవారం వెలగపూడిలోని రాష్ట్ర అసెంబ్లీ భవనం ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర శాసన మండలి అధ్యక్షులు కొయ్యే మోషేన్ రాజు నూతన సభ్యులతో ప్రమాణం చేయించారు. రాష్ట్ర శాసన సభ సెక్రటరీ జనరల్ డా.పిపికె.రామాచార్యులు నూతన ఎంఎల్సిల పేర్లను వరుస క్రమంలో పిలవగా శాసన మండలి అధ్యక్షులు మోషేన్ రాజు వారిచే ప్రమాణం చేయించారు. ఎంఎల్సిలుగా కడప స్థానిక సంస్థల నుండి ఎన్నికైన పి.రామసుబ్బా రెడ్డి, నెల్లూరు స్థానిక సంస్థల నుండి మేరిగ మురళీధర్, పశ్చిమ గోదావరి స్థానిక సంస్థల నుండి కవురు శ్రీనివాస్, వంకా రవీంద్రనాధ్, తూర్పు గోదావరి స్థానిక సంస్థల నుండి కుడిపూడి సూర్య నారాయణ రావు, శ్రీకాకుళం స్థానిక సంస్థల నుండి నర్తు రామారావు, చిత్తూరు స్థానిక సంస్థల నుండి సుబ్రహ్మణ్యం సిఫాయి, కర్నూల్ స్థానిక సంస్థల నుండి డా.ఎ. మధుసూదన్ ప్రమాణం చేశారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర పంచాయితీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు, రాష్ట్ర రెవెన్యూ శాఖామాత్యులు ధర్మాన ప్రసాద రావు, రాష్ట్ర సమాచార పౌరసంబంధాలు, బిసి సంక్షేమం ,సినిమాటోగ్రఫీ శాఖామాత్యులు సిహెచ్.శ్రీనివాస వేణుగోపాల కృష్ణ, రాష్ట్ర పౌరసరఫరాల శాఖామాత్యులు కారుమూరి వెంకట నాగేశ్వరరావు, రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖామాత్యులు మేరుగు నాగార్జున, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు(ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణా రెడ్డి, రాష్ట శాసన సభ చీఫ్ విప్ ముదునూరి ప్రసాద రాజు, రాష్ట్ర శాసన మండలి చీఫ్ విప్ ఉమారెడ్డి వెంకటేశ్వర్లు, ప్రభుత్వ విప్ జంగా కృష్ణ మూర్తి, మాజీమంత్రి ధర్మాన కృష్ణదాస్, ఎంఎల్ఏ వరప్రసాద్, పలువురు ఎంఎల్సిలు పాల్గొన్నారు. ఇంకా కార్యక్రమంలో రాష్ట్ర శాసన మండలి ఓఎస్డి శాసన మండలి ఉప కార్యదర్శి విజయ రాజు ఇంకా పలువురు అధికారులు పాల్గొన్నారు.

ప్రజాతపన
prajathapana.com

# ఏపీలో కూటములపై చర్చ

**విజయవాడ :**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజకీయాలు ఉన్నట్లుండి వేడెక్కాయి. అందుకు రెండు కారణాలు కనిపిస్తున్నాయి. అందులో ఒకటి.. అకాల వర్షాలతో దిగాలు పడుతున్న రైతులను పరామర్శించే పేరిట రెండు ప్రధాన విపక్షాలు తెలుగుదేశం, జనసేన పార్టీలు రాష్ట్రంలో విస్తృతంగా పర్యటించడం. రెండో కారణం.. ఏపీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ముందస్తు ఎన్నికలకు వెళ్ళవచ్చున్న సంకేతం. రెండింటిలో ఏది కారణమైనా పెద్దగా తేడా లేదు. కానీ, వైయస్ జగన్మోహన్ రెడ్డి అసెంబ్లీని రద్దుచేసి తెలంగాణ సహా జరగనున్న ఆరు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలతో పాటే తాను ఎన్నికలకు వెళ్ళనున్నారు అన్న వార్త మాత్రం విపక్షాలను ఒక్కసారి యాక్టివ్ గా చేసింది అని చెప్పవచ్చు. నిజానికి గత కొంతకాలంగా ముఖ్యమంత్రి వైయస్ జగన్ వ్యూహాలను అంచనా వేస్తూ తమ తమ రాజకీయ వ్యూహాలకు విపక్షాలు పదును పెడుతున్నాయి. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ తాను కమిట్ అయిన సినిమాలను పూర్తి చేస్తూనే వీలైనంత ఎక్కువగా జిల్లాల్లో పర్యటిస్తున్నారు. ఇంకోవైపు తెలుగుదేశం అధినేత మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా జిల్లాల పర్యటనలను వేగవంతం చేశారు. ఇంకోవైపు జనవరి చివరి వారంలో మొదలుపెట్టిన పాదయాత్రతో టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ జనాలతో మమేకం అవుతున్నారు. ఇటీవల జరిగిన మూడు గ్రాడ్యుయేట్ నియోజకవర్గాల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వచ్చిన ఫలితాలు టిడిపి, జనసేన పార్టీలలో ఉత్సాహాన్ని నింపాయనే చెప్పాలి. అదే ఉత్సాహాన్ని కొనసాగిస్తూ వచ్చే ఎన్నికలను ఎదుర్కోవాలని రెండు పార్టీలు వ్యూహరచన చేస్తున్నాయి. జనసేన, టీడీపీ కలిస్తే వైయస్సార్సీపీని అధికారం నుంచి తప్పించవచ్చని ఇరుపార్టీల నేతలు భావిస్తున్నారు. కానీ వచ్చిన చిక్కల్లా జనసేన పార్టీ ప్రస్తుతం భారతీయ జనతా పార్టీతో దోస్తీ నెరపడమే. ఆ దోస్తీని తెగదెంపు చేసుకుని టిడిపితో పవన్ కళ్యాణ్ జతకడతారా? లేక బిజెపిని ఒప్పించి మూడు పార్టీల కూటమి కూర్పులో కీలక భూమిక వహిస్తారా అన్నది కీలకంగా మారింది. అకాల వర్షాల కారణంగా పంటలను కోల్పోయి.. దిగాలు పడుతున్న కోస్తా ప్రాంత రైతాంగాన్ని పరామర్శించేందుకు పవన్ కళ్యాణ్ ఇటీవల తూర్పుగోదావరి జిల్లాలో పర్యటించారు. ఆయన పర్యటించిన మర్నాడు చంద్రబాబు కూడా ఆ ప్రాంత పర్యటనకు వెళ్లారు. ముఖ్యంగా పవన్ కళ్యాణ్ తన ప్రసంగాలలో ఈ మధ్య మూడు పార్టీలు కలిస్తే జగన్‌ని గద్దె దింపడం సులభతరం అవుతుందని చెబుతూ వస్తున్నారు. కానీ అదే జరుగుతుంది అని ఆయన కచ్చితంగా చెప్పలేకపోతున్నారు. తెలుగుదేశం పార్టీతో కలిసేందుకు బిజెపి అధిష్టానానికి రిజర్వేషన్స్ ఉన్నాయన్న సంగతి జగమెరిగిన సత్యం. దానికి కారణం కూడా అందరికీ విధితమే. 2019 నాటి ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీతో జతకట్టిన చంద్రబాబు.. బిజెపి నేతలను మరీ ముఖ్యంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీని తీవ్ర స్థాయిలో దుయ్యబట్టారు. ఒక దశలో చంద్రబాబు మాటలు హద్దు మీరాయి కూడా. అలాంటి చంద్రబాబుతో కలిసి పనిచేసేందుకు ఇటు ఏపీ బీజేపీ నేతలకు, అటు పార్టీ అధినేతలకు ఇష్టం లేదనేది ప్రస్తుతానికి అందరి అభిప్రాయం. కానీ, రాజకీయాలలో ఎప్పుడు ఏమి జరుగుతుందో ఎవరు చెప్పలేరు. గుర్రం ఎగిరినట్టు బిజెపి మెత్తబడి టిడిపి, జనసేన కూటమితో కలిసి ఏపీ అసెంబ్లీ ఎన్నికలను ఎదుర్కొనవచ్చు. కానీ టిడిపితో కలిసేంత వైరం బిజెపికి వైసీపీతో లేదు. ఇంకా చెప్పాలంటే బిజెపి నేతల సూచన మేరకే జగన్ ముందస్తు ఆలోచన చేస్తూ ఉండవచ్చు కూడా. ఎందుకంటే బీజేపీకి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంపై పెద్దగా ఆశలు లేవు. అక్కడ వైసీపీ తరపున గెలిచే ఎంపీలు కేంద్రంలో మోదీ ప్రభుత్వానికి అన్ని రకాలా మద్దతు పలుకుతూనే వున్నారు. వచ్చే ఎన్నికల తర్వాత ఉభయ కుశలోపరి వైసీపీ, బీజేపీలకు ప్రయోజనాలుంటాయి. జగన్ ముందస్తుకు వెళితే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అసెంబ్లీకి ఒకసారి, పార్లమెంటుకు ఒకసారి ఎన్నికలు జరుగుతాయి. పార్లమెంటు ఎన్నికలు సెపరేటుగా జరిగితే పూర్తిగా మోదీ చరిస్మా పనిచేస్తే.. కనీసం రెండు, మూడు ఎంపీ సీట్లు అయినా గెలుచుకోవచ్చని కమలనాథులు భావిస్తూ ఉండవచ్చు. అందుకే ముందస్తు యోచన పరిశీలించమని ఏపీ సీఎం జగన్మోహన్ రెడ్డికి బిజెపి అధిష్టానం సూచించినట్టు చెప్పుకుంటున్నారు. ఇక్కడ ఇంకొక అంశం కూడా బిజెపి కోణంలో కీలకం. ఏపీ, తెలంగాణ అసెంబ్లీలకు ఒకేసారి అసెంబ్లీ ఎన్నికలు జరిగితే.. రెండు రాష్ట్రాలలో ఓటు హక్కు కలిగిన వారు ఖచ్చితంగా తమ సొంత ఏరియాలో ఓటు హక్కు వినియోగిం చుకునేందుకు మొగ్గు చూపుతారు. ఆ లెక్కన హైదరాబాద్, రంగారెడ్డి, ఖమ్మం జిల్లాలలో ఉన్న ఆంధ్ర ప్రాంత వాసులు ఇక్కడ ఓటు వేయకుండా తమ సొంత ప్రాంతానికి వెళ్లి ఓటు వేయడం వల్ల టిఆర్ఎస్ పార్టీకి ఎంతో కొంత నష్టం కలిగించవచ్చని బిజెపి నేతలు వ్యూహరచన చేస్తూ ఉండవచ్చు. ఒక దినపత్రికలో జగన్ ముందస్తు ఆలోచన చేస్తున్నారన్న వార్త రావడంతో టిడిపి, జనసేన అప్రమత్తమయ్యాయి. పవన్ కళ్యాణ్ అయితే ఏకంగా వచ్చే నెల నుంచి ఏపీలో క్షేత్రస్థాయిలో మరింతగా పర్యటిస్తామని ప్రకటించారు. " సేఫ్ ఆంధ్ర ప్రదేశ్ నా కండిషన్ దానికోసం వైసిపిని గద్దెదింపడం అనివార్యం" అని పవన్ కళ్యాణ్ వ్యాఖ్యానించడం విశేషం. అదే సమయంలో తన పార్టీ ఒక్కటే రాష్ట్రంలో మ్యాజిక్ ఫిగర్ దక్కించుకోలేదని చెబుతూ కూటమి అవసరాన్ని నొక్కి చెప్పారు పవన్ కళ్యాణ్. ఒకవైపు జగన్ 175 సీట్లకు 175 సీట్లు గెలిచే లక్ష్యంతో పనిచేస్తున్నానని చెబుతుంటే.. పవన్ కళ్యాణ్ కేవలం 35 నుంచి 40 సీట్లు వస్తే చాలని తానే కింగ్ మేకర్‌నని ఎన్నికలకు ఆరు నెలల ముందుగానే ప్రకటించేశారు. ఈ లెక్కన ఆలోచిస్తే ఏపీలో వైసిపి తర్వాత టిడిపినే బలమైన పార్టీ అని జనసేన అని పరోక్షంగా అంగీకరించినట్లయ్యింది. ప్రభుత్వ ఓట్లను ఎట్టి పరిస్థితుల్లోనూ చీలనివ్వను అని పవన్ కళ్యాణ్ గత ఏడాదిన్నర కాలంగా చెబుతూ వస్తున్నారు. దానికి అనుగుణంగానే రాష్ట్రంలో కూటమి కూర్పు కోసం ఆయన ప్రయత్నిస్తున్నట్లు అర్థమవుతుంది. ఇక తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు తనదైన శైలిలో వ్యూహరచన చేస్తున్నట్లు కనిపిస్తుంది. బిజెపిని కూటమి వైపు తీసుకువచ్చే బాధ్యతలను పవన్ కళ్యాణ్‌కు అప్పగించి.. తాను క్షేత్రస్థాయి పర్యటనలను ఎంచుకోవడం వ్యూహాత్మకమని అర్థమవుతుంది. ఒకవైపు నారా లోకేష్ పాదయాత్ర.. ఇంకోవైపు పరామర్శల పేరిట చంద్రబాబు గ్రౌండ్ లెవెల్ పర్యటనలు.. మరోవైపు పార్టీ యంత్రాంగాన్ని సమాయత్తం చేయడం లాంటి చర్యలు తెలుగుదేశం పార్టీలో కనిపిస్తున్నాయి. తెలంగాణలోనూ నెంబర్ పెంచుకోవాలని చూస్తున్న చంద్రబాబు మంచి ఆర్థిక పరిపుష్టి కలిగిన కాసాని జ్ఞానేశ్వర్‌ను రాష్ట్ర అధ్యక్షునిగా నియమించారు. ఆయన సారథ్యంలో ఉమ్మడి ఖమ్మం, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలలో టిడిపి తరఫున బలమైన అభ్యర్థులను నిలిపేందుకు ప్రయత్నిస్తున్నారు. పార్టీకి ముందు నుంచి అండగా నిలుస్తున్న సామాజిక వర్గాన్ని ఏకం చేసే ప్రయత్నాలు అంతర్లీనంగా చంద్రబాబు కొనసాగిస్తున్నారు. టిడిపి నుంచి ఇతర పార్టీలలోకి వెళ్లిన నేతలను తిరిగి రప్పించే ప్రయత్నాలు కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే కేసీఆర్ పంచన చేరిన మాజీ టిడిపి నేతలు బీఆర్ఎస్ పార్టీ మరోసారి అధికారంలోకి వచ్చే సంకేతాలు లేకపోతే టిడిపి వైపు చూసే అవకాశం ఉంది. దీనికి ఏపీలో ఏర్పడే మూడు పార్టీల కూటమికి ఇంటర్ లింక్ ఉందని మనం విశ్లేషించుకోవచ్చు. ఎందుకంటే ఏపీలో టీడీపీ–బీజేపీ పొత్తు ఉంటే తెలంగాణలోనూ దాని ప్రభావం ఎంతో కొంత ఉంటుంది. అప్పుడు కేంద్రంలో ఏర్పడే ప్రభుత్వంలో టిడిపి భాగస్వామి అయ్యే అవకాశాలు కూడా ఉంటాయి. ఇదంతా మోదీ మూడోసారి విజయం సాధించే అవకాశాలుంటేనే సుమా. ఏతా వాతా ఇరు తెలుగు రాష్ట్రాల రాజకీయం ఇప్పుడు రాజకీయ పొత్తుల మీద.. ఏర్పడబోయే కూటములమీద ఆధారపడి ఉన్నాయని విశ్లేషించుకోవచ్చు.

## రేవంత్ దిష్టి బొమ్మ దగ్ధం

**హైదరాబాద్**

మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పై టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు నిరసనగా శ్రీ కృష్ణ భారతీయ యాదవ సేవ సంఘం ఆందోళనకు దిగింది. బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తు హైదరాబాద్ ఖైరతాబాద్ చౌరస్తాలో రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు మంత్రి తలసానిని ఉద్దేశిస్తూ పెండ పిసుక్కోనే వాడని రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు యావత్ యాదవ జాతిని కించపరిచే విధంగా ఉన్నాయని వారు ఆరోపించారు. అనాదిగా అణగారిన వర్గాలపై అగ్రకులాల వ్యక్తులు అవహేళన చేసే విధంగా మాట్లాడుతున్నారని... వారి వైఖరి మార్చుకోవాలని వారు హితవు పలికారు. ఇప్పటికైనా రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పకపోతే ఆయనను ఎక్కడికక్కడ ఘోరావ్ చేస్తామని హెచ్చరించారు.

## పాత వీడియోలతో ట్రోల్ చేస్తున్నారు

**హైదరాబాద్**

కర్ణాటక లో ఓడిపోయిన ప్రెస్టేషన్ తో పాత వీడియోలన్నీ తీసి మరలా నన్ను ట్రోల్ చేస్తున్నారని కాంగ్రెస్ నేత అద్దంకి దయాకర్ ఆరోపించారు. పాకిస్తాన్ ప్రేమికుడు అద్దంకి దయాకర్ అంటూ ట్రోల్ చేస్తున్నారు. అన్ని మతాలను కులాలను ప్రాంతాలను సమానంగా ప్రేమించే గుణం ఉండాలి. మోడీ పాకిస్తాన్ పోతే ఎవరు మాట్లాడారు ట్రోల్ చేయరు. మోడీ పాకిస్తాన్ వెళ్లి నవాజ్ షరీఫ్ వాళ్ళ అమ్మ కాళ్లు మొక్కారు. నవాజ్ షరీఫ్ మనవరాల బర్డే ఫంక్షన్ లో పాల్గొన్న మోడీ పాకిస్తాన్ ప్రేమికుడు కాదు. నా శత్రువైన అందర్నీ ప్రేమించాలి అన్న నన్ను టోల్ చేస్తున్నారు సిగ్గుండాలి. పాకిస్తాన్ ,ముస్లింలు లేకపోతే మీ పార్టీ ఎలాంటి రాజకీయం లేనట్లుందని అన్నారు.

## ఈ-గరుడ పేరుతో ఎలక్ట్రిక్ ఏసి బస్సులు

**హైదరాబాద్**

పర్యావరణ హితమైన ఎలక్ట్రిక్ ఏసీ బస్సులు ప్రయాణికులకు అందుబాటులోకి రాబోతున్నాయి. హైదరాబాద్–విజయవాడ మార్గంలో 50 ఎలక్ట్రిక్ ఏసీ బస్సులను నడపాలని నిర్ణయించిన టీఎస్ఆర్టీసీ, వాటిలో 10 బస్సులను మంగళవారం నుంచి వాడకంలోకి తెస్తోంది. అత్యున్నత నాణ్యత ప్రమాణాలు, హైటెక్ హంగులతో అందుబాటులోకి తెస్తున్న ఈ కొత్త ఎలక్ట్రిక్ ఏసీ బస్సులకు 'ఈ–గరుడ'గా సంస్థ నామకరణం చేసింది. హైదరాబాద్ మియాపూర్ క్రాస్ రోడ్స్ సమీపంలోని పుష్పక్ బస్ పాయింట్ వద్ద మంగళవారం సాయంత్రం 4.30 గంటలకు ఈ బస్సులు ప్రారంభోత్సవం జరగనుంది. తెలంగాణ రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, సంస్థ చైర్మన్, ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్దన్ తో కలిసి "ఈ–గరుడ" బస్సులను ప్రారంభించడం జరుగుతుంది.

## తెలంగాణ సర్కార్‌లోనే పల్లెప్రగతికి బాటలు

**-గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి**

**-మౌళిక సదుపాయాల కల్పనకు ప్రణాళికలు**

**-పరిపాలన సౌలభ్యం కోసం పక్కాభవనాలు**

**-జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధూకర్**

**మంథని**

ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ సర్కార్‌లోనే పల్లె ప్రగతికిబాటలు పడుతున్నాయని పెద్దపల్లి జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధూకర్ అన్నారు. సోమవారం మంథని మండలం కాకర్లపల్లి గ్రామంలో ఉపాధి హమీ పథకం ద్వారా రూ. 20లక్షల నిధులతో చేపట్టిన గ్రామపంచాయతీ భవనానికి పెద్దపల్లి జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధూకర్ భూమిపూజ చేశారు. ఈసందర్భంగా జెడ్పీ చైర్మన్ పుట్ట మధు మాట్లాడుతూ ఆనాడు చిన్న గ్రామపంచాయతీలతో పరిపాలన సౌలభ్యం సాధ్యమవుతుందని ఆలోచన చేసిన ముఖ్యమంత్రి కేసీఆర్ అనేక గ్రామపంచాయతీలను ఏర్పాటుచేశారని ఆయన గుర్తుచేశారు. ఈ క్రమంలో ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేయాలనే లక్ష్యంగా ముందుకు సాగుతూ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిసారించారన్నారు. ఇప్పటికే పల్లె ప్రగతి కార్యక్రమం ద్వారా అనేక గ్రామాలు అభివృద్ధి చెంది ముఖచిత్రాలే మారిపోయాయన్నారు. ప్రతి గ్రామంలో ప్రజలకు మౌళిక సదుపాయాలు కల్పించాలని ప్రత్యేక ప్రణాళికలతో పాలన అందిస్తున్నారని ఆయన వివరించారు. ఈనాడు గ్రామస్థాయిలో పరిపాలన సౌలభ్యం కోసం పక్కా భవనాలు నిర్మించి ఇటు ప్రజలకు, అటు ప్రజాప్రతినిధులకు ఇబ్బందులు లేకుండా చూస్తున్నారని ఆయన అన్నారు. గ్రామపంచాయతీ భవనాల నిర్మాణంతో ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. అభివృద్ధికి చిరునామాగా బీఆర్ఎస్‌ప్రభుత్వం, ముఖ్య మంత్రి కేసీఆర్ నిలుస్తారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కనవేన పద్మ,ఎంపీపీ కొండా శంకర్ జెడ్పి టిసి తగరం సుమలత మార్కెట్ కమిటీ చైర్మన్ అనంతరెడ్డి సింగల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ రైతుబంధు అధ్యక్షుడు ఆకుల కిరణ్, టిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు ఏగోలపు శంకర్ గౌడ్, నాయకుడు తగరం శంకర్ లాల్ లతోపాటు నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

## విద్యుత్ ఉపకేంద్రం పనులు అడ్డుకుంటున్న ఫారెస్ట్ అధికారులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి

**ఏటూరు నాగారం**

మండలం చిన్న బోయినపల్లి గ్రామంలో విద్యుత్ ఉపకేంద్రం పనులను అడ్డుకుంటున్న ఫారెస్ట్ అధికారులపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని చిన్నబోయినపల్లి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు సోమవారం రోజున ఉపకేంద్రం వద్ద ఫారెస్ట్ అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ మండలంలోని చిన్న బోయినపల్లి ,పెద్ద వెంకటాపురం, రాయబంధం, హనుమాన్ నగర్, శివాపూర్, గోగుపల్లి, లింగాపూర్ ,షా పెల్లి, దొడ్ల కొత్తూరు, దొడ్ల, మల్యాల, కొండాయి, ఐలాపూర్, తదితర మారుమూల ఏజెన్సీ గ్రామల ప్రజలు గత పది ,15, సంవత్సరాలుగా కరెంటు కోతలతో సతమతమవుతున్నారు. వర్షాకాలం సీజన్ వచ్చిందంటే నిత్యం కురుస్తున్న వర్షాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయి అనేక గ్రామాలు అంధకారంలో ఉండటమే కాకుండా కొన్ని గిరిజన గ్రామాలలో గిరిజన వాసులు రాత్రి వేళలో క్రింద నిద్రిస్తున్న సమయాలలో విసిసర్పాల కాటుకి బలి అయినా సందర్భాలు ఉన్నాయి విద్యుత్ కోతలతో సతమతమవుతున్న ఆయా గ్రామాల ప్రజలు వైస్ ఎంపీపీ తుమ్మ సంజీవరెడ్డి, జడ్పీ చైర్మన్ , ములుగు ఎమ్మెల్యే దృష్టికి, పలుమార్లు తీసుకెళ్లడం జరిగింది. దీనిపై స్పందించిన జడ్పీ చైర్మన్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి విద్యుత్ సబ్ స్టేషన్ మంజూరు చేయించడం జరిగింది. సబ్ స్టేషన్ స్థలానికి సంబంధించి గ్రామస్తులు 98 సర్వే నెంబర్లు 30 గుంటల స్థలాన్ని అధికారులకు కేటాయించడం జరిగింది. సబ్ స్టేషన్ పనులు ప్రారంభించాలని కాంట్రాక్టర్లకు జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేయగా గత రెండు నెలల నుంచి విద్యుత్ ఉపకేంద్రం పనులు జరుగుతుండగా ఫారెస్ట్ అధికారులు ఇట్టి పరిస్థితులలో పనులు చేయడానికి వీలులేదని కాంట్రాక్టర్లను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. గత వారం రోజుల నుండి పనులకు ఆటంకం కలిగిస్తూ అక్కడున్నటువంటి పరికరాలను వెనక్కి పంపిస్తున్నారు అని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేయడం జరిగింది. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని రెండు రోజులలో ఉపకేంద్రం పనులకు క్లియరెన్స్ ఇవ్వాలని లేని పక్షంలో ఈ నెల 16వ తారీకున ఐదు గ్రామపంచాయతీలకు సంబంధించిన ప్రజలు చిన్నబోయినపల్లి 163 జాతీయ రహదారిపై పదివేల మందితో ఆందోళన కార్యక్రమం చేయక తప్పదు అన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్షుడు వడకాపురం సారయ్య, ఏటూరు నాగారం వైస్ ఎంపీపీ తుమ్మ సంజీవరెడ్డి, చిన్న బోయినపల్లి గ్రామ సర్పంచ్ (చేల లక్ష్మి) వినయ్, యం డి యాకుబ్, తుమ్మ నరసింహారెడ్డి, గంగు యాకుబ్ రెడ్డి, దూడ సోమయ్య, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

## మెలకెత్తిన ధాన్యాన్ని షరతులు లేకుండా కొనుగోలు చేయాలి

**మంథని**

వర్షానికి తడిసి మెలకెత్తిన ధాన్యాన్ని షరతులు లేకుండా వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐసీసీ సెక్రెటరీ, ఎమ్మెల్యే దుద్దిల్ల శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు రాష్ట్ర కిసాన్ సెల్ పిలుపు మేరకు ముస్కుల సురేందర్ రెడ్డి అధ్వర్యంలో పెద్దపల్లి జిల్లా కేంద్రములోని కలెక్టరేట్ ముందు నిరసన కార్యక్రమం చేపట్టి జిల్లా కలెక్టర్ కు కాంగ్రెస్ నాయకులు రైతులతో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగాకిసాన్ సెల్ పెద్దపల్లి జిల్లా చైర్మన్ ముస్కుల సురేందర్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు చొప్పరి సదానందం లు మాట్లాడుతూ పెద్దపల్లి జిల్లాలోని రైతులు అనేక విషయాలలో ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని,గత కొన్ని రోజుల నుండి కురుస్తున్న అకాల వర్షాల కారణంగా పంటలు దెబ్బతిని, ధాన్యం తడిసి మొలకెత్తడం జరిగింద న్నారు. తడిసిన (మొలకెత్తిన) ధాన్యాన్ని ఎలాంటి షరతులు లేకుండా రైస్ మిల్లర్లు నేరుగా రైతుల సమీపంలో ఉన్న సెంటర్ల దగ్గరు వెళ్ళి ఎలాంటి కోతలు లేకుండా కొనుగోలు చేయాలి, సెంటర్లలో వడ్లు తడవకుండ(టార్పలిన్) కవర్లు ఏర్పాటు చేయాలని, గన్ని సంచులు కూడా రైతులకు అందించాలన్నారు. మొక్కజొన్న రైతులకు సరైన ధర చెల్లించాలని,వడగండ్ల వానకు నష్టపోయిన రైతుల పట్ల ప్రభుత్వము ప్రత్యేక శ్రద్ధ వహించి రైతురాజ్య స్థాపితంగా రైతు దేశానికి వెన్నుముక అని ప్రభుత్వాలు చర్యలు తీసుకొని అన్ని విషయాలలో రైతులకు సరైన విధంగా ఆదుకోనేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమములో కాంగ్రెస్ నాయకులు మంథని మండల అధ్యక్షులు సేగ్గెం రాజేష్, సింగల్ విండో డైరెక్టర్ రావి కంటి సతీష్, బీసీ సెల్ మంథని డివిజన్ అధ్యక్షులు గోటుకారి కిషన్ జి, ఎస్సీ సెల్ మంథని డివిజన్ అధ్యక్షులు మంథని సత్యం, సీనియర్ నాయకులు ఒడ్నాల శ్రీనివాస్ జంజర్ల శేఖర్, అజీమ్ ఖాన్, బీసీ సెల్ మంథని టౌన్ అధ్యక్షులు బండారి ప్రసాద్, మాజీ సర్పంచులు దొర గొర్ల శ్రీనివాస్ యాదవ్, నాగుల రాజయ్య, మంథని మున్సిపల్ కౌన్సిలర్ పెంద్రి రమా సురేష్ రెడ్డి, మాది వార్డు సభ్యురాలు మార్పాక నిహారిక, అధికార ప్రతినిధి తోకల మల్లేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉట్ల అనిల్ రెడ్డి , చిదురాల దామోదర్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ మండల్ కార్యదర్శి కొమ్మిడి సంతోష్ రెడ్డి, నాయకులు మబ్బు తిరుపతి, యాదగిరి తిరుపతి, పెద్దపల్లి సోషల్ మీడియా ఇన్చార్జి అరెల్లి కిరణ్ గౌడ్, మంథని నియోజకవర్గం సోషల్ మీడియా ఇన్చార్జి పెండ్యాల రాజు, కమాన్పూర్ మండల్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ నాగపూర్ అజయ్, నాయకులు ఇరుగురాల శేఖర్, తదితరు కాంగ్రెస్ పార్టీ నాయకులు రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

## బీజేపీ నేతపై పోలీసు దాడిని ఖండిస్తున్నాం

**విజయవాడ**

ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షులు సురేష్ పై పోలీసు దాష్టికాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిట్ర శివన్నారాయణ అన్నారు. నెల్లూరు జిల్లా, కావలి ఎమ్మెల్యే అవినీతి, అక్రమాలపై సీఎం కు వివరించేందుకు బీజేపీ నాయకులు అనుమతి కోరారు. కావలి ఎమ్మెల్యే అరాచకాలను వివరిస్తూ వినతి పత్రం కూడా సిద్ధం చేశారు. సీఎం పర్యటన ప్రాంతానికి వెళ్లి సీఎంను కలిసే అవకాశం ఇవ్వాలని కోరారు. కుదరకపోతే అక్కడి నుంచి పంపించాలే గానీ.. పోలీసులే ఇష్టం వచ్చినట్లుగా మా నేతలపై దాడి చేశారని ఆయన ఆరో?పించారు. సురేష్ ను రెండు కాళ్ళ మధ్య పెట్టి ఓ పోలీసు అధికారి చేసిన దాష్టికాన్ని అందరూ చూశారు. బీజేపీ నాయకులుపై దాడికి పాల్పడిన పోలీసుల మీద వెంటనే చర్యలు తీసుకోవాలి. బీసీలకు ప్రాధాన్యత ఇస్తామని చెప్పుకునే జగన్.. తనను కలిసేందుకు వచ్చిన పై దాడి చేస్తే స్పందించరా. పోలీసుల తీరుపై రాష్ట్రాల డీజిపిని కలిసి ఆధారాలతో ఫిర్యాదు చేస్తాం. బీసిల అభ్యున్నతికి నిజాయతీగా పని చేసిన పార్టీ బీజేపీ మాత్రమే. బీసీ కమిషన్ ద్వారా బీసీలకు మోడీ న్యాయం చేశారు. జగన్ వైఫల్యాలు, విధానాలపై ప్రజలే తిరగబడుతున్నారని అన్నారు. అందుకే రోడ్లపైకి వస్తే పరదాల చాటున జగన్ పర్యటనలు చేస్తున్నారు. జగన్ ప్రభుత్వం తీరుపై బీజేపీ మొదటి నుంచీ పోరాటాలను కొనసాగిస్తుంది. ఆలయాలపై దాడులు చేసిన వారిని ఇంతవరకు శిక్షించలేదు. బీజేపీ నేతలపై దాడులు చేసి భయ పెట్టాలంటే చూస్తూ ఊరుకోమని అయన అన్నారు. మా నాయకులపై దాడి చేసిన డీఎస్పీని సస్పెండ్ చేయాలి. కొన్ని వర్గాల వారికే కొమ్ము కాసేలా జగన్ పాలన సాగుతుంది. రాష్ట్రం ఏమైనా పర్వాలేదు.. నాకు ఓట్లు , కోట్లు కావాలనే విధంగా జగన్ తీరు ఉంది. కేంద్రం ఎపీ లో అమరావతి అభివృద్ధికి నిధులు కేటాయించింది, ప్రాజెక్టులు పనులు చేపట్టింది. జగన్ పోలీసుల పై చర్యలు తీసుకుని బీసీ ఆత్మగౌరవం కాపాడాలి. భవిష్యత్ లో ఇటువంటి దాష్టికాలు జరగకుండా పోలీసులు నియంత్రించాలని అన్నారు.

# 'మను చరిత్ర' జూన్ 23న విడుదల



యంగ్ హీరో శివ కందుకూరి హీరోగా తెరకెక్కుతున్న 'మను చరిత్ర 'చిత్రం విడుదలకు సిద్ధమవుతోంది. ఈ చిత్రంలో శివ సరసన మేఘా ఆకాష్, ప్రగతి శ్రీవాస్తవ్ హీరోయిన్లుగా నటించారు. భరత్ పెదగాని దర్శకుడిగా పరిచయం అవుతున్నాడు.మను చరిత్ర వరంగల్ నేపథ్యంలో సాగే ఇంటెన్స్ లవ్ స్టోరీ. శివ ఇంటెన్సివ్ రోల్ ప్లే చేస్తున్నాడు. గతంలో విడుదల చేసిన టీజర్ అతన్ని ఫెరోషియస్ అవతార్‌లో ప్రజంట్ చేసింది.ఈ చిత్రం ప్రమోషనల్ కంటెంట్ కు మంచి రెస్పాన్స్ వచ్చింది. విడుదల తేదీని అనౌన్స్ చేసి టీమ్ జోరుగా గా ప్రమోషన్లను ప్లాన్ చేస్తోంది. 'మను చరిత్ర' జూన్ 23న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది. శ్రీ విజయ ఫిల్మ్స్ ఈ సినిమా వరల్డ్ వైడ్ థియేట్రికల్ హక్కులను పొందింది. ప్రొద్దుటూరు టాకీస్ పతాకంపై ఎన్ శ్రీనివాస రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. గోపీ సుందర్ సంగీతం అందించగా, రాహుల్ శ్రీవాత్సవ్ సినిమాటోగ్రాఫర్.

తారాగణం: శివ కందుకూరి, మేఘా ఆకాష్, ప్రియా వడ్లమాని, ప్రగతి శ్రీవాత్సవ్, సుహాస్, డాలీ ధనంజయ్, శ్రీకాంత్ అయ్యంగార్, మధునందన్, రఘు, దేవిశ్రీ ప్రసాద్, ప్రమోదిని, సంజయ్ స్వరూప్, హర్షిత, గరిమ, లజ్జా శివ, కరణ్, గడ్డం శివ.

# చక్రవ్యూహం' హక్కులను దక్కించుకున్న "మైత్రి మూవీ డిస్ట్రిబ్యూషన్"

విలక్షణ పాత్రలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న నటుడు అజయ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న మర్డర్ మిస్టరీ క్రైమ్ థ్రిల్లర్ చిత్రం "చక్రవ్యూహం' -ది ట్రాప్ అనేది ఉపశీర్షిక..చెట్కూరి మధుసూధన్ దర్శకత్వంలో సహస్ర క్రియేషన్స్ బ్యానర్‌పై నిర్మాత శ్రీమతి. సావిత్రి నిర్మిస్తున్న ఈ సినిమా అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకొని జూన్ 2 విడుదలకు సిద్ధమవుతుంది. ఇటీవలే ఈ చిత్ర టీజర్ ను గ్రాండ్ గా విడుదల చేశారు.

ఆ సందర్భంలో చిత్ర దర్శకుడు మధు సుధన్ మాట్లాడుతూ.. మర్డర్ మిస్టరీ క్రైమ్ థ్రిల్లర్ గా తెరకెక్కిన మా "చక్రవ్యూహం" చిత్ర ఫస్ట్ లుక్‌ని విడుదల చేసిన స్వర్గీయ సూపర్ స్టార్ కృష్ణ గారికి ధన్యవాదాలు. ఆయన విడుదల చేసిన ఫస్ట్ లుక్ కు ప్రేక్షకులనుండి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది.ఇందులో నటించిన నటీనటులు, టెక్నిషియన్స్ అందరూ ఫుల్ సపోర్ట్ చేయడంతో సినిమా చాలా బాగా వచ్చింది అంటూ చెప్పుకొచ్చారు.

విరూపాక్ష సినిమాలో తన విలక్షణమైన నటనతో అందరిని ఆకట్టుకున్న అజయ్ ఈ సినిమాలో పవర్ ఫుల్ పోలీస్ రోల్ లో కనిపించనున్నారు.

1:05 నిడివి ఉన్న ఈ టీజర్ మొదటినుండి చివరివరకు ఆసక్తికరంగా ఉంది. అద్భుతమైన విజువల్స్ తో అదిరిపోయే బ్యాక్గ్రౌండ్ స్కోర్ తో ఈ టీజర్ ఆకట్టుకుంటుంది.మర్డర్ మిస్టరీ క్రైమ్ థ్రిల్లర్ గా తెరకెక్కిన ఈ "చక్రవ్యూహం" చిత్రాన్ని జూన్ 2 గ్రాండ్ గా ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తున్నారు చిత్ర బృందం. ఈ చిత్రం సీడెడ్, నైజాం డిస్ట్రిబ్యూషన్ హక్కులను "మైత్రి మూవీ డిస్ట్రిబ్యూషన్" శశిధర్ రెడ్డి దక్కించుకున్నారు. వాల్తేరు వీరయ్య, వీర సింహా రెడ్డి వంటి మాస్ కమర్షియల్ హిట్ సినిమాలు తరువాత "మైత్రి మూవీ




డిస్ట్రిబ్యూషన్" చేస్తున్న మర్డర్ మిస్టరీ క్రైమ్ థ్రిల్లర్ "చక్రవ్యూహం".

తారాగణం: అజయ్, జ్ఞానేశ్వరి, వివేక్ త్రివేది, ఊర్వశి పరదేశి, ప్రజ్ఞా నయన్, శుభలేఖ సుధాకర్, రాజీవ్ కనకాల, ప్రియ, శ్రీకాంత్ అయ్యంగార్, కిరీటి, రాజ్ తిరందాసు, రవితేజ, మోహన్.

# బ్లాక్ బస్టర్ మేకర్ బోయపాటి శ్రీను, ఉస్తాద్ రామ్ పోతినేని,ఫస్ట్ థండర్ బ్లాస్ట్

బ్లాక్ బస్టర్ మేకర్ బోయపాటి శ్రీను, ఉస్తాద్ రామ్ పోతినేని ల మోస్ట్ ఎవైటెడ్ ప్రాజెక్ట్ చఃనీఎజీజూజీబితిఖీంఖూ ఈరోజు స్టార్ రామ్ పుట్టినరోజు ప్రత్యేక సందర్భంగా ఫస్ట్ థండర్ బ్లాస్ట్ అయ్యింది. థండర్ ఒక బ్లాస్టింగ్ ఎపిసోడ్ తో ప్రారంభమవుతుంది. రామ్ తనదైన శైలిలో మాస్ ఎంట్రీ ఇస్తూ సదర్ పండుగ కు ఒక పెద్ద ఎద్దుని తీసుకువస్తాడు. అక్కడ గూండాల గ్యాంగ్ తో మాసివ్ ఫైట్ చేస్తాడు. ప్రతి ఫ్రేమ్ లో బోయపాటి స్టాంప్ ఉంది. రామ్ తన అద్భుతమైన స్క్రీన్ ప్రెజెన్స్ తో అదనపు బలాన్ని తీసుకువచ్చారు.రామ్ మునుపెన్నడూ చూడని మాస్ లుక్ లో కనిపించాడు. పాత్ర కోసం తన శరీరాన్ని బిల్డ్ చేశారు. "నీ స్టేట్ దాటలేనన్నావ్ దాటా... నీ గేటు దాటలేనన్నావ్ దాటా... నీ పవర్ దాటలేనన్నావ్ దాటా... ఇంకేంటి దాటేది నా బొంగులో లిమిట్స్..." అనే డైలాగ్ అభిమానులను, మాస్ ని మెప్పిస్తుంది. శ్రీలీల ని కూడా వీడియోలో చూడవచ్చు. సంతోష్ డిటాకే తన ఎక్స్ట్రార్డినరీ కెమెరా పనితనం తో ఆకట్టుకున్నాడు. ఎస్ఎస్ థమన్ తన థండర్స్ తో కూడిన బ్యాక్ గ్రౌండ్ స్కోర్ తో విజువల్స్ ను ఎలివేట్ చేశాడు. శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్ బ్యానర్ పై అత్యున్నతమైన సాంకేతిక ప్రమాణాలు, నిర్మాణ విలువలతో భారీ బడ్జెట్ తో



నిర్మాత శ్రీనివాస చిట్టూరి ఈ చిత్రాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. జీ స్టూడియోస్ సౌత్, పవన్ కుమార్ సమర్పిస్తున్నారు. ఈ చిత్రానికి ఎడిటింగ్ తమ్మిరాజు. మొత్తానికి ఫస్ట్ థండర్ మాస్ ని ఉర్రూతలూగిస్తోంది.

# ఆకట్టుకుంటున్న 'రూల్స్ రంజన్' మొదటి పాట

కిరణ్ అబ్బవరం, నేహా శెట్టి జంటగా రత్నం కృష్ణ దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం 'రూల్స్ రంజన్'. సుప్రసిద్ధ నిర్మాత ఏ.ఎం. రత్నం సమర్పణలో స్టార్ లైట్ ఎంటర్టైన్మెంట్ పతాకంపై దివ్యాంగ్ లవానియా, మురళి కృష్ణ వేమూరి నిర్మిస్తున్నారు. రింకు కుక్రెజ సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. అతి కొద్ది కాలంలోనే యువతకి ఎంతగానో చేరువైన నాయకానాయికలు కిరణ్ అబ్బవరం, నేహా శెట్టి కలయికలో వస్తున్న సినిమా కావడంతో 'రూల్స్ రంజన్'పై ప్రేక్షకుల్లో మంచి అంచనాలు ఉన్నాయి. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్ కి విశేష స్పందన లభించింది. ఇక తాజాగా ఈ చిత్రం నుంచి మొదటి పాట విడుదలైంది.

'నాలో నేనే లేను' : విభిన్న ప్రేమ గీతం

'నాలో నేనే లేను' లిరికల్ వీడియోని సోమవారం ఉదయం విడుదల చేసింది చిత్ర బృందం. తన ప్రేమను కథానాయకకి చెప్పడం కోసం కథానాయకుడు పడే తపన ఈ పాటలో చూపించారు. కళ్లద్దాలు, నుదుటున బొట్టుతో బుద్ధిమంతుడిలా కనిపిస్తున్న కథానాయకుడు.. నాయికని ఫాలో అవుతూ ఆమె గురించి పాడుకోవడం ఆకట్టుకుంది. లిరికల్ వీడియోలో నాయికలా నాట్యం చేయబోయి కథానాయకుడు కిందపడటం, ఆమె నడిచొస్తుంటే అతను పూలు చల్లడం వంటి సరదా సన్నివేశాలు అలరించాయి. అమ్రిష్ గణేష్ స్వరపరిచిన సంగీతం వినసొంపుగా, ఆహ్లాదకరంగా ఉంది. సంగీతానికి తగ్గట్టుగానే రాంబాబు గోసాల అందించిన సాహిత్యం ఎంతో హాయిగా, స్వచ్ఛంగా ఉంది. అందరికీ అర్థమయ్యే భాషలో ఎంతో అర్థవంతంగా పాటను రాశారు. ఇక శరత్ సంతోష్ ఎంతో అందంగా పాటను ఆలపించి కట్టిపడేశారు.



కథానాయకుడు 'ప్రేమాలాపన':

'నాలో నేనే లేను' పాట విడుదల సందర్భంగా గీత రచయిత రాంబాబు గోసాల మాట్లాడుతూ.. " రూల్స్ రంజన్ చిత్రంలో నాలో నేనే లేను అనే పాట రాసినందుకు చాలా సంతోషం, మా దర్శకులు రత్నం కృష్ణ గారు చాలా మంచి సందర్భాన్ని నాకు వివరించారు. చాలా అందమైన చిన్న చిన్న పదాలతో తన ప్రేమని కథానాయిక కి తెలియజేయడం కోసం కథానాయకుడు పడే తపన ఈ పాటలో చెప్పాము. 'నాలో నేనే లేను నీలోనే ఉన్నాను' అంటూ మొదలయ్యి నేను ఊహల్లో లేను ఎప్పుడూ నీ ఊసుల్లోనే ఉంటున్నాను నువ్వు ఏం మాయ చేసావు నీ రూపం ఒక మాయ నువ్వే ఒక మాయ నాకు నిద్ర పట్టట్లేదు కానీ చాలా హాయిగా ఉంది ఇంతకుముందు ఎప్పుడు ఇలా లేదు అనుకుంటూ తన ఫీలింగ్స్ ని చెప్పుకునే పాట. చాలా అందమైన బాణీకి చాలా మంచి తేలిగ్గా పాడుకునేటట్లుగా ఉండే పదాలతో పాటని రాయమని చెప్పారు. చరణాలు కవితాత్మకంగా చెప్పాము. పువ్వులా నువ్వు వస్తే నీ నుంచి వచ్చే పరిమళాల గాలి నాతో మాట్లాడింది అని, నువ్వు సిగ్గుపడుతూ నవ్వుతుంటే నన్ను నేను మర్చిపోయానని చరణాలు స్టార్ట్ అవుతాయి. నాతో ఇంత మంచి పాట రాయించినందుకు మా దర్శకులకి కృతజ్ఞతలు, అలాగే హీరో హీరోయిన్లు కిరణ్ అబ్బవరం గారు నేహా శెట్టి ఈ పాటలో చాలా అందంగా కనిపించారు. చాలా చాలా బాగుంది విజువల్ గా, సంగీత దర్శకులు అమ్రిష్ గారు చాలా మంచి బాణీ అందించారు. అలాగే గాయకులు శరత్ సంతోష్ చాలా బాగా పాడారు. ఈ పాట పెద్ద హిట్ అవుతుందని అలాగే ఈ సినిమా కూడా చాలా పెద్ద హిట్ అవుతుందని ఆశిస్తున్నాను. ఇంత మంచి ప్రొడక్షన్లో ఇంత మంచి సినిమాకి ఇంత మంచి పాట రాసినందుకు మా నిర్మాతలకి అలాగే నన్ను ఎంకరేజ్ చేసిన మా టీం అందరికీ కృతజ్ఞతలు తెలుపుకుంటూ ఈ పాటని సినిమాని ఆదరించాలని కోరుకుంటున్నాను" అన్నారు.

Printed, Published & Owned by K.Umadevi And Printed at Varadhi Publications,D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh.Published at D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh. EDITOR :K.Umadevi ,
e mail ID : b.nagaseshu47@gmail.com cell No:9985509053 RNI/APTEL/2021/80950